

సమన్వయం లేకుంటే చర్యలు

డీఈవో నాగేశ్వరరావు బుధవారం మరిపెడ మండలంలోని గుండెపుడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమన్వయంతో ముందుకెళ్లాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు.

వివరాలు 7లో...

ఈనాడు మహబూబాబాద్

గురువారం 24 ఆగస్టు 2017 | 16 పేజీలు



100% ఉద్యోగాలు

'ఈనాడు' ముఖాముఖిలో నిట్ డైరెక్టర్ జీఆర్‌సీ రెడ్డి

- నాణ్యమైన పరిశోధనలకు పెద్దపీట
- వచ్చే నెలలో స్నాతకోత్సవం
- కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రాక
- నిధుల సమస్య లేదు

ముఖాముఖి

ఈనాడు, వరంగల్, నిట్ క్యాంపస్, న్యూస్‌టుడే

దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందు నిలపడంలో వరంగల్‌లోని జాతీయ సాంకేతిక విద్యా సంస్థ ఎనలేని పాత్ర పోషిస్తోంది.. ఇక్కడ చదివిన వారు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో తమదైన ముద్రవేస్తున్నారు.. కీలక స్థానాల్లో పనిచేస్తున్నారు.. గుణాత్మకమైన విద్య, పరిశోధనలకు పెద్దపీట వేస్తుండడంతో విద్యార్థులు రాటుదేలుతున్నారు... వచ్చే నెలలో స్నాతకోత్సవం జరగబోతోంది.. దీనికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టబోయే కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలపై 'ఈనాడు' సంచాలకుడు జీఆర్‌సీ రెడ్డితో ముఖాముఖి మాట్లాడింది.

ప్రశ్న: ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం సాంకేతికతపై ఎంతో దృష్టిసారించింది. ఆ దిశగా మీ పాత్ర ఏంటి?

డైరెక్టర్: దేశంలో పరిశోధనలవైపు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా జాతీయ సాంకేతిక విద్యా సంస్థల పాత్ర ఎంతో కీలకం. వరంగల్ నిట్‌లో ఇప్పటికే విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. వీటి నాణ్యత పెంచడంపై

మిగతా 2లో...




ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో!

- మారని ప్రభుత్వ ఉద్యోగుల తీరు
- జిల్లా పాలనాధికారి వేదన అరణ్య రోదనే

న్యూస్‌టుడే, డోర్నకల్

జిల్లాల పునర్విభజన అయ్యాక పాలన చేరువైందని సంతోషించిన ప్రజలు అనతి కాలంలోనే నిర్వేదం చెందుతున్నారు. కొందరు ఉద్యోగుల తీరు ఏ మాత్రం మారకపోవడమే ఇందుకు కారణం. నాలుగో తరగతి సిబ్బంది మొదలు అధికారి వరకు స్థానికంగా ఉండకుండా యథేచ్ఛగా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా పాలనాధికారి డాక్టర్ ప్రీతిమీన పలు సార్లు జరిపిన తనిఖీల్లో సమయ పాలన పాటించని వైనం కళ్లకు కట్టినా, షోకాజ్ నోటీసులిచ్చి.. సస్పెన్షన్ వేటు వేసినా

మిగతా 2లో...



సురక్షిత చర్యలేవి?

'ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయండి.. సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి' అని పదే పదే చెప్పే అధికారులు.. ప్రయాణికుల భద్రతను మాత్రం విస్మరిస్తున్నారు.. వరంగల్ రీజియన్‌లోని బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు కరవయ్యాయి... దూర ప్రాంతాలకు వెళ్లే వాటిలోనూ పెట్టడం లేదు..

వివరాలు 3లో...



డీసీసీబీ పాలకవర్గానికి వారం గడువు!

సహకార ట్రైబ్యునల్‌కు వెళ్లేందుకు అవకాశం

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: డీసీసీబీ కథ రోజుకో మలుపు తిరుగుతోంది. ఎప్పుడు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో తెలియని పరిస్థితి నెలకొంది. అటు ప్రభుత్వం, ఇటు కోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడుతున్నాయి. ఫలితంగా ఈ వ్యవహారం రసకందాయకంగా మారింది. సర్కారు నిర్వహించిన సమగ్ర విచారణలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. అధికారుల నివేదిక ఆధారంగా ఈనెల 17న పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాము ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు లేవని, తమపై కక్షతోనే పాలకవర్గాన్ని రద్దు చేసిందని ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, మరో 20 మంది డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన ఉన్నత న్యాయస్థానం పాలకవర్గం ఈ నెల 31 వరకు కొనసాగేందుకు

మిగతా 2లో...

100 శాతం ఉద్యోగాలు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి సారించాం.

ప్రశ్న: పరిశోధనలకు సరిపడా నిధులు వస్తున్నాయా?

డైరెక్టర్: నా అనుభవంలో నిధుల కొరత అనేది ఎప్పుడూ ఎదురుకాలేదు. ఇక్కడ జరిగే పరిశోధనలకు కావాల్సిన మొత్తం కేంద్రం ఇస్తూనే ఉంటుంది. అధ్యాపకులు, పరిశోధకులు పలు జాతీయ, అంతర్జాతీయ ఫండింగ్ ఏజెన్సీల సాయంతో అద్భుతమైన ప్రాజెక్టులను రూపొందిస్తున్నారు. ఈ సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. అధ్యాపకులకు ఇటీవల మూడు అవార్డులు దక్కడం ఇక్కడి వారి ప్రతిభకు తార్కాణం.

ప్రశ్న: పరిశోధనల ఫలితాలు సమాజానికి ఎలా చేరుతున్నాయి?

డైరెక్టర్: పరిశోధనలు చేశాక దీర్ఘకాలంలో వాటి ఫలితాలు కనిపిస్తాయి. వాటికి విరామం అంటూ ఉండకూడదు. నిరంతరం సాగాల్సిన ప్రక్రియ. మొక్కలు నాటాక నీరు పోసి పెంచినట్టే, పరిశోధకులకు ప్రోత్సాహకాలు అందిస్తే భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం ఉంటుంది. ఆసక్తి ఉన్నవారినే కాకుండా, ఇతరులనూ పరిశోధనల వైపు మళ్లించే ప్రయత్నం నిట్ ద్వారా జరుగుతోంది.

ప్రశ్న: నైపుణ్యాభివృద్ధికి ఏమైనా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారా?

డైరెక్టర్: నిట్ పూర్వ విద్యార్థుల సంఘం ('ఆలుమ్ని') ఈ బాధ్యత తీసుకొంది. ఇప్పటికే క్యాంపస్ ఎదురుగా ఉన్న పున్నమి అతిథిగృహంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణం జరుగుతోంది. త్వరలో పూర్తి కానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'టాస్క్'పేరుతో యువతలో నైపుణ్యాన్ని పెంపొందించే కార్యక్రమం చేపట్టింది. వారితో సమన్వయంతో మా అధ్యాపకుల సూచనలు, సలహాలతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తాం.

ప్రశ్న: కొత్తగా వినూత్నమైన కార్యక్రమాలేమైనా చేపట్టబోతున్నారా?

డైరెక్టర్: నిట్‌లో జరిగే ప్రతిదీ వినూత్నమే. వచ్చే నెలలో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నాం. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ముఖ్య అతిథిగా రానున్నారు. ఈ నెల 29న 'మంతన్' పేరుతో సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. దేశ వ్యాప్తంగా 75 విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలను ఎంపిక చేయగా, అందులో మన సంస్థ ఉండడం సంతోషదాయకం. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడమే దీని లక్ష్యం. అందుకే మేం ప్రత్యేక అంశాన్ని ఎంపిక చేశాం. 'హమారా సంకల్ప్ నయా భారత్' అన్నది వరంగల్ నిట్ నినాదం. ఈ అంశంపై ఆ రోజు సమగ్ర చర్చ జరగనుంది. అంతేకాకుండా రాక్‌బ్యాండ్‌తో విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించనున్నారు.

ప్రశ్న: క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఎలా ఉన్నాయి?

డైరెక్టర్: గతేడాది 86 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారంతా ప్రముఖ కంపెనీల్లో ఆకర్షణీయమైన జీతభత్యాలను అందుకుంటున్నారు. మిగతా 14 శాతం ఉన్నత విద్య, వివిధ ప్రాజెక్టుల కోసం ఉద్యోగాల్లో చేరలేదు. అంటే నూరు శాతం ఉద్యోగాలకు ఎంపికవుతారని చెప్పాలి.

ప్రశ్న: అకడమిక్ విషయాలపై ఎలా దృష్టి సారిస్తున్నారు?

డైరెక్టర్: ఇంజినీరింగ్‌లో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. పరిశ్రమలతో ముడిపడి ఉన్న అంశాలను పాఠ్యాంశాల్లో జోడించి బోధించే దిశగా కసరత్తు చేస్తున్నాం. అధ్యాపకులు వృత్తిగతంగా మరింత నైపుణ్యం సాధించేందుకు శిక్షణ ఇపిస్తున్నాం. విదేశాల నుంచి విషయ నిపుణులను ఆహ్వానించి వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, సింపోజియంలు నిర్వహిస్తున్నాం.

గణేశ్ నవరాత్రి వేడుకలు
ప్రశాంతంగా నిర్వహించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నివర్గాల ప్రజలు పరస్పర సహాయ సహకారాలు అందించుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కె.దామోదర్‌రెడ్డి కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు రెండు వేలకు పైగా వినాయకుల విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వేడుకల సందర్భంగా ఎక్కడా శాంతి భద్రతల సమస్య ఎదురుకాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు. మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, గూడూరు లాంటి మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే క్రేన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పోలీసు శాఖాధికారులు ట్రాఫిక్ సమస్య లేకుండా తగిన ఏర్పాట్లు చూడాలన్నారు. బక్రీద్, వినాయక చవితి వేడుకలు ఒకేసారి వస్తున్నందున ఆయా వర్గాల ప్రజలు సమన్వయంతో ఉంటూ ఎవరికి ఇబ్బంది కలగకుండా సహకరించుకోవాలని సూచించారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ మండపాలు, చెరువులు, ప్రత్యేక కూడళ్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విద్యుత్తు, వైద్యశాఖ, పురపాలక శాఖాధికారులు పాల్గొన్నారు. అనంతరం జేసీ దామోదర్‌రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, డీటీవో భద్రూనాయక్, తహసీల్దార్ విజయకుమార్ మున్నేరు వాగు ప్రాంతాన్ని సందర్శించారు. నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు.

మార్కెట్ ధరలు

వరంగల్ మార్కెట్, న్యూస్‌టుడే: మార్కెట్లో బుధవారం వివిధ సరకులకు లభించిన గరిష్ఠ, కనిష్ఠ ధరలు (క్వింటాల్‌కు) రూపాయల్లో ఇలా ఉన్నాయి. ధాన్యం విజయమసూరి: 2150-2150, జేజే: 1500-1500, 1001: 1400-1400, మక్కలు: 1517-1356, మినుములు: 4855-4855, పల్లికాయ: 4630-2000, కొత్త కందులు: 4355-2786, పెసర్లు: 4415-3675, ఆముదాలు: 3511-3511, సోయాచిక్కుడు తెల్లవి: 2615-2615, చిక్కుడు: 2469-2469, పత్తి: 5240-4800, పసుపు కాడి: 7100-6100, గోల: 6700-5700, మిర్చి తేజ: 5000-2000, వండర్‌హాట్: 2000-1100, తాలు: 1000-500.

త్రుటిలో తప్పించుకున్న సూర్యం..!

కొత్తగూడ, న్యూస్‌టుడే: న్యూడెమోక్రసీ పెద్దచంద్రన్న వర్గానికి చెందిన సూర్యం దళానికి, పోలీసుల మధ్య బుధవారం సాయంత్రం రామన్నగూడెం అటవీ ప్రాంతంలో త్రుటిలో కాల్పులు తప్పాయి. విశ్వసనీయ వర్గాలు, ఆ పార్టీ సానుభూతిపరులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూడెమోక్రసీ సూర్యం దళం సభ్యులు బుధవారం రామన్నగూడెం అటవీ ప్రాంతంలో పలువురితో సమావేశమై చర్చిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న కొత్తగూడ పోలీసులు సీఆర్‌పీఎఫ్ బృందంతో హుటాహుటిన రామన్నగూడేనికి చేరుకొని సూర్యం దళం సమావేశమైన అటవీ ప్రాంతం వైపు వెళ్లారు. పోలీసులు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న సూర్యం ఘటన స్థలం నుంచి దళ సభ్యులు, దళాన్ని కలిసేందుకు వచ్చిన వ్యక్తులతో సహా అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. సూర్యం దళంతో పాటు ఆయన వెంట ఉన్న ఎనిమిది మంది దళసభ్యులు అక్కడి నుంచి సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై స్థానిక ఎస్ఐ సతీష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అడవిలో గుడుంబాను తయారుచేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వెళ్లామన్నారు. దళానికి సంబంధించిన తమకెలాంటి సమాచారం లేదన్నారు. తమ రాకను తెలుసుకున్న దళం సభ్యులు పారిపోయి ఉండొచ్చన్నారు.

సర్పంచి సహా ఏడుగురికి జైలుశిక్ష

పరకాల, ఆత్మకూరు, న్యూస్‌టుడే: తెరాస గ్రామ పార్టీ కార్యాలయం ధ్వంసం కేసులో తెదేపాకు చెందిన శాయంపేట మండలం గట్లకానిపర్తి సర్పంచి వైనాల విజయ సహా మరో ఏడుగురికి బుధవారం పరకాల జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించారు. శాయంపేట ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం... 2014 ఆగస్టు 29న గట్లకానిపర్తిలో తెరాస గ్రామ శాఖ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అదే సమయంలో తొలిసారిగా గ్రామానికి వచ్చిన స్పీకర్ సిరికొండ మధుసూదనాచారిని సన్మానించాలని నిర్ణయించారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పార్టీ గ్రామ శాఖ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయగా స్పీకర్ సన్మానసభకు తనను ఆహ్వానించలేదని తెదేపాకు చెందిన గ్రామ సర్పంచి వైనాల విజయ, ఆమె అనుచరులు గొడవ చేశారు. ఆ సమయంలో పార్టీ కార్యాలయ ఇంటికి సంబంధించిన షట్టర్, ఫర్నీచర్‌ను గడ్డపారతో ధ్వంసం చేయడంతో తెరాసకు చెందిన కక్కెర్ల ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సర్పంచి విజయ, వైనాల కుమారస్వామి, బత్తిని కిషన్, చిలుక గోపి, ఒంటేరు రవిచంద్ర, తప్పట్ల మొగిలి, బొమ్మకంటి చంద్రమౌళి, బొమ్మకంటి మహేందర్‌పై అప్పటి ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు. 2014 నుంచి కోర్టులో కేసు నడుస్తుండగా నింధితుల్లో బత్తిని కిషన్ ఏడాది క్రితం మృతి చెందారు. కేసుకు సంబంధించిన సాక్షులను బుధవారం శాయంపేట పోలీసుస్టేషన్ కోర్టు కానిస్టేబుల్ వన్నాల శ్రీనివాస్ పరకాల జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో జూనియర్ సివిల్ జడ్జి రెండేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో!

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితిలో కించిత్ మార్పు రావట్లేదు. ఆమె వేదన అరణ్య రోదనగానే మిగిలిపోతోంది.

ఆలస్యంగా వచ్చి ముందుకు బయలుదేరి...: డోర్నకల్ నియోజకవర్గ కేంద్రంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులైనా, ఉపాధ్యాయులైనా కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) వైపు నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఎక్కువ మంది రైళ్లలో వస్తున్నారు. ఇవి ఏ రోజూ సమయానికి రావు. నిత్యం అరగంట సేపు ఆలస్యంగా పని చేసే చోటుకు చేరుకుంటున్నారు. దూర గ్రామాలకు వెళ్లే వారు గంటల కొద్దీ ఆలస్యంగా విధులకు వెళ్తున్నారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 3.30 గంటలకే బయలుదేరుతున్నారు. పక్కనే జిల్లా కేంద్రం ఉంది. ఏ ఉన్నతాధికారైనా వస్తే ఎలాగనే భయం ఎవరికీ లేదు.

మూడు గంటలకు మించి పనిచేయట్లేదు..: కేసముద్రం మండలానిది మరో ప్రత్యేకత... ఇక్కడ పని చేసే వారు ఎక్కువగా వరంగల్, మహబూబాబాద్ నుంచి వస్తూ పోతున్నారు. రైళ్లు దిగాక కార్యాలయాలు, విద్యా సంస్థలకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతుంది. మూడు గంటలు మించి పని చేయడం లేదు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిది ఇష్టారాజ్యం. వీరు ఏ రోజూ నిర్ణీత వేళకు వచ్చిన దాఖల్లాలేవని రోగులు వాపోతున్నారు.

జిల్లా కేంద్రంలోనూ అదే పరిస్థితి..: జిల్లా కేంద్రమైన మహబూబాబాద్‌కూ మినహాయింపు ఏమీ కాదు. కలెక్టరేట్ సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, పాఠశాలల ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల నుంచి వస్తూపోతూనే ఉన్నారు. స్థానిక నివాసం అనేది ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. జిల్లా పాలనాధికారి దీని గురించి పదే పదే చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

అనేక ఇబ్బందులు: ఉపాధ్యాయులు ఆలస్యంగా వచ్చి ముందే వెళ్లి పోతుండటంతో ఆ ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతోంది. వారు వెనుకంజలో ఉండడానికి ఇది ప్రధాన కారణమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే అధికారులు, ఉద్యోగులు ఆలస్యంగా రావడం వల్ల ఇతర గ్రామాల నుంచి పనుల మీద వచ్చిన వాళ్లు పడిగాపులు కాయాల్సి వస్తోంది. సమయపాలనపై కలెక్టర్ పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి కట్టడి చేస్తేనే ఫలితంగా ఉంటుంది.

డీసీసీబీ పాలకవర్గానికి వారం గడువు!

(మొదటిపేజీ తరువాయి): బుధవారం అనుమతినిచ్చింది. తర్వాత ప్రభుత్వం జారీ చేసిన రద్దు ఉత్తర్వులు అమలులోకి వస్తే సహకార ట్రైబ్యునల్‌కు వెళ్లేందుకు అవకాశం కల్పించింది. ఈ విషయమై మళ్లీ హైకోర్టుకు పోయేందుకు అవకాశం లేదు. 31 పాలకవర్గంపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని యథాతథంగా విధుల్లో కొనసాగించాలని తీర్పును వెలువరించింది. మరో పక్క వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ డీసీసీబీ ప్రత్యేక అధికారిగా విధుల్లో చేరారు. కోర్టు ఉత్తర్వులను డైరెక్టర్లు మెయిల్ ద్వారా కలెక్టర్ పాటిల్‌కు పంపించినట్లు తెలిపారు. ఆయన నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాలేదు. గురువారం సీట్లో ఎవరు కూర్చుంటారో అనే విషయం ఆసక్తిగా మారింది.

ఆ తల్లి ఓడింది.. ఈ అమ్మ గెలిచింది!



తల్లిపాలిస్తున్న మంగపేట గ్రామానికి చెందిన బాలింత రమ్య

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: అప్పుడే తల్లి గర్భం నుంచి బయటికొచ్చిన ఆనవాలుగా ఒంటికి అంటిన నెత్తుటి మరకలు పోనే లేదు... ఆ కన్నతల్లి మాత్రం మాతృత్వపు మమకారాన్ని మంటలో కలిపి తన ప్రతిరూపాన్ని అనాథను చేసింది.. ఆ అనాథ శిశువు ఆకలి కేకలు విని ఓ మాతృ హృదయం తల్లడిల్లింది. తన పాలిచ్చి అమ్మ మనసు చాటుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో రోడ్డుపై నిలబెట్టిన ఒక ఆటోలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని మహిళ అప్పుడే పుట్టిన ఆడపిల్లను తనకు భారమని భావించి వదిలేసి వెళ్లిపోయింది. పూర్తిగా తెల్లవారిన తర్వాత ఆ మార్గంలో వెళ్తున్న వారు చూడటంతో విషయం ఊరంతా తెలిసింది. ఆ చిన్నారి పరిస్థితిని చూసి మహిళలు కంట తడి పెట్టేశారు. చాలా మంది తల్లులు ఆ చిన్నారి ఏడుపు విని తల్లడిల్లిపోయారు. ఆ పసిగుడ్డును ఒక మహిళ చేరదీసి శుభ్రం చేసి వేడి నీళ్లతో స్నానం చేయించింది. ఆ పసికందును అంగన్‌వాడీ కార్యకర్తలు చేరదీశారు. ఎంతకూ ఆ పసికందు ఏడుపు ఆపకపోవడంతో ఏం చేయాలా అని ఆలోచించి రెండు, మూడు రోజుల క్రితం ప్రసవించిన మహిళ కోసం ఆరా తీశారు. పస్రా గ్రామంలో మంగపేట గ్రామానికి చెందిన ఇప్పాల రమ్య ఉందని తెలిసి అక్కడికి వెళ్లారు. గుక్కపెట్టి ఏడుస్తున్న ఆ పసికందు పరిస్థితిని చూసి ఆమె వెంటనే శిశువు ఆకలి తీర్చింది.. ఒకింత ప్రాణదాతగా నిలిచింది...! ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు బత్తిని కళ్యాణి ఫిర్యాదు మేరకు పస్రా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతరం ఆ పసికందును 108 వాహనంలో సిబ్బంది వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఐసీడీఎస్ అధికారులు ఆ శిశువును జిల్లా కేంద్రంలోని శిశుగృహకు తరలిస్తారని కళ్యాణి చెప్పారు.



ఆటోలో లభించిన పసికందు

5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

రాంనగర్, న్యూస్‌టుడే: సమాజంలోని వికలాంగులకు విద్యా, ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్లను కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.నరసింహులు కోరారు. బుధవారం హన్మకొండ రాంనగర్‌లో సుందరయ్యభవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సమావేశం జిల్లా సదస్సు శ్రీధర్‌లోథ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహులు మాట్లాడుతూ.. తెరాస ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే వికలాంగులకు పింఛన్, అంత్యోదయ కార్డు, ఉద్యోగాలలో ప్రత్యేకమైన కోటా ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. 40 శాతం వికలాంగుడు ఉంటే అన్ని సంక్షేమ పథకాలను అర్హులవుతారన్నారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చి దానిని 60 శాతానికి పెంచిందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ.7 కోట్లు ప్రకటించారన్నారు. ఆగస్టు 27, 28 తేదీలలో సంగారెడ్డిలో జరిగే ఎన్‌పీఆర్‌డీ రెండో రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు మురళీ, దేవిక, కృష్ణవేణి, స్వరూప, రోశయ్య, సతీష్, యాకయ్య, రాధిక, రమేశ్, అనిల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం.. సుఖమయం.. అని చెబుతున్న అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడంలేదు. ప్రైవేటు వాహనాల నుంచి పోటీని తట్టుకునేందుకు ప్రయాణికులను ఆకర్షించేందుకు రకరకాల రాయితీలను ప్రవేశపెడుతుంది. కానీ వారికి సరిపడ వసతులు కల్పించడంలేదు. ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా గమ్యస్థానాలకు వెళ్తామనే భరోసా ప్రజల్లో ఉన్నా.. బస్సుల్లో ఉండాల్సిన ప్రథమ చికిత్స కిట్లు ఏ ఒక్క దానిలో కనిపించడంలేదు. ఎక్కడైన ప్రమాదం జరిగి గాయాలైతే ఆసుపత్రికి పరుగెత్తాల్సిన పరిస్థితి. ఈనేపథ్యంలో బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్ల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.



సురక్షిత చర్యలేవి?

పరిశీలన

ఆర్టీసీ బస్సుల్లో కనిపించని ప్రథమ చికిత్స కిట్లు
దూర ప్రాంతాలకు వెళ్లే వాటిలోనూ అంతే..

జులైవాడ, న్యూస్‌టుడే

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలో అయిదు జిల్లాలో 9 డిపోలలో 984 బస్సులు రోజు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నాయి. ప్రతి రోజు 354 మార్గాలలో రోజుకు 3.84 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. రోజుకు 10 లక్షల మంది వివిధ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వీటి ద్వారా ఆర్టీసీకి రోజుకు రూ1.10 కోట్ల ఆదాయం సమకూరుతుంది. దాదాపు 400 బస్సుల వరకు దూర ప్రాంతాలకు వెళ్తుంటాయి. బస్సుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ముందు జాగ్రత్తగా ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేయాలి. వాటిలో ప్రథమ చికిత్సకు సంబంధించిన వస్తువులను ఏర్పాటు చేయాలి. కానీ వరంగల్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో దాదాపు చాలా బస్సులకు ప్రథమ చికిత్స బాక్సులను ఏర్పాటు చేయలేదు. కొన్ని బస్సుల్లో అవి ఉన్నా ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇక దూర ప్రాంతాలకు వెళ్లే సర్వీసుల్లో ప్రథమ చికిత్స పెట్టెలు డ్రైవర్ల బట్టలు, బ్రష్‌లు, పేస్టులు తదితర వస్తువులు పెట్టుకునే చిన్నపాటి ఆల్మారాలా కనిపిస్తున్నాయి. వాటికి ప్రథమ చికిత్స పెట్టెలు అనే బదులు డ్రైవర్ పెట్టె అంటే బాగుంటుందని కొందరు ఎద్దేవా చేస్తున్నారు.

'న్యూస్‌టుడే' పరిశీలించగా...

బుధవారం హన్మకొండ బస్టాండు నుంచి ఉదయం 10.40 గంటలకు శ్రీశైలం వెళ్తున్న సూపర్ లగ్జరీని 'న్యూస్‌టుడే' పరిశీలించగా అందులో ప్రథమ చికిత్స పెట్టెలో ఎలాంటి పరికరాలు కనిపించలేదు.

మ.2.00 గంటలకు పల్మనేరు బయలుదేరుతున్న ఇంద్ర ఏసీ బస్సుల్లో చూడగా అందులో ఖాళీ పెట్టె మాత్రమే కనిపించింది.

బెంగళూర్ వెళ్తున్న రాజధాని ఏసీ బస్సును పరిశీలించగా ప్రథమ చికిత్స పెట్టె ఉన్నా ఖాళీగా కనిపించింది.



ప్రథమ చికిత్స అని రాసి ఉన్న పెట్టె





తెరిస్తే ఇలా



ప్రథమ చికిత్స పెట్టెలో ఉండాల్సిన వస్తువులు

రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి

–ఆర్ఎం.సూర్యకిరణ్, వరంగల్ రీజియన్

ప్రథమ చికిత్స కిట్లను కొన్ని బస్సుల్లో పెట్టాం. చాలా వరకు లేవు. కార్పొరేషన్ అంతటా ఇదే పరిస్థితి ఉంది. కొన్ని చోట్ల వాటికి సెక్యూరిటీ లేక దొంగిలిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. చాలా వరకు ప్రయాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూనే ఉంటారు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు....

వారం రోజుల కిందట నర్సంపేట నుంచి వస్తున్న మెట్రో బస్సు అదుపు తప్పి పొలాలలోకి వెళ్లింది. అందులో కొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ప్రథమ చికిత్స కిట్టు లేకపోవడంతో కొంతమంది గాయపడిన వారిని దగ్గరలోని ప్రైవేటు వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న అధికారులు ఆ వైద్యుడికి కొంత డబ్బు ముట్టజెప్పినట్లు తెలిసింది.

గత వారం హన్మకొండ లోకల్ బస్సు దిగుతున్న ప్రయాణికుడు అదుపుతప్పి హెడ్ పోస్టాఫీస్ వద్ద కిందపడగా గాయాలయ్యాయి. చేసేదేమిలేక ఆ ప్రయాణికుడు తిన్నగా వెళ్లి ఆసుపత్రిలో చేరారు.

15 రోజుల కిందట బీబీనగర్‌లో వజ్ర మినీ ఏసీ బస్సు ప్రమాదానికి గురైంది. అయిదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నారు.

గత నెల ఆలేరు వద్ద వజ్ర బస్సు కారు ఢీకొనడంతో ఓ బాటసారి మరణించారు. బస్సులో ఉన్న కొంతమందికి గాయాలయ్యాయి. వారు దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నారు.

ఇలా పలు సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అధికారులు, యాజమాన్యం ప్రయాణికుల అవసరాలను గుర్తించి ప్రమాదాలను ముందు జాగ్రత్తగా బస్సులలో ప్రథమ చికిత్స సదుపాయాలను కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదాలకు బాధ్యులు ఎవరు?

–రాము, ప్రయాణికుడు



ఆర్టీసీ ప్రయాణం సురక్షితమంటారు. వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతామని చెబుతారు. కానీ తీరా చూస్తే దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో సైతం ప్రథమ చికిత్స పరికరాలు లేవు. మధ్యలో ఏదైనా చిన్నపాటి ప్రమాదం జరిగితే అప్పటికప్పుడు ఏం చేయాలి. ఆర్టీసీ యాజమాన్యం బస్సుల్లో ప్రథమ చికిత్స పరికరాలు అందుబాటులో ఉంచాలి.

ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేయాలి

–తిరుపతి, ప్రయాణికుడు



ఆర్టీసీ అధికారులు ముందు జాగ్రత్తగా బస్సులలో ప్రథమ చికిత్స పెట్టెలను ఏర్పాటు చేయాలి. అనుకోకుండా ప్రమాదాలు జరిగితే అవి ఉపయోగపడతాయి. వాటితో ఎప్పటికైనా ఉపయోగమే అధికారులు ఆ దిశగా ఆలోచించాలి.

సమ సమాజ స్థాపనకు ఉద్యమాలు

పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేత విజయఖన్నా

సుబేదారి, న్యూస్‌టుడే: సమాజంలోని అసమానతల రద్దు, విద్యార్థుల హక్కుల సాధనకు విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాల్సిన తక్షణ కర్తవ్యం విద్యార్థులపై ఉందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.విజయఖన్నా పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ కార్యవర్గ సమావేశం బుధవారం సుబేదారి ఆర్ట్స్ కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయఖన్నా మాట్లాడుతూ.. కులం, మతం పేరుతో విద్యార్థులను విభజించి వారు సంఘటితం కాకుండా అడ్డుకుంటున్నారన్నారు. విద్యార్థులు బూర్జువ రాజకీయ నాయకులు చెప్పే మాటలను నమ్మొద్దన్నారు. సొంతగా ఆలోచించాల్సిన అవసరముందని తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులకు సంబంధించిన అనేక సమస్యలున్నప్పటికీ ప్రభుత్వం వాటిని పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. పరిష్కరించమంటే ఉక్కుపాదంతో అణచి వేస్తుందన్నారు. డిగ్రీలో ఆన్‌లైన్ ప్రవేశాల కోసం ప్రవేశపెట్టిన దోస్త్ పథకం తప్పుల తడకగా మారిపోయిందన్నారు. విద్యార్థులు ప్రవేశాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో వెంకట్‌రెడ్డి పీడీఎస్‌యూ నాయకులు అనిల్, తిరుపతి, రేవంత్, శ్రవణ్, శ్రీకాంత్, రంజిత్, శివ రాజేశ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయఖన్నా

మహబూబాబాద్

తెరపై ఈనాడు

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముకుంద -**జయ జానకి నాయక,** వెంకట్రామ -**నిన్నుకోరి,** శ్రీనివాస్ -**నేనే రాజు నేనే మంత్రి,** లక్ష్మి -**లై**

మూడు గంటలు ఆలస్యంగా విధులకు..!

అధికారుల కోసం ప్రజల పడిగాపులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశించినా వారిలో మార్పు రావడం లేదు. జిల్లా కార్యాలయాల్లో విధులు నిర్వహించే వివిధ శాఖల అధికారులు స్థానికంగా ఉండకపోగా.. విధుల్లో సమయపాలన పాటించడం లేదు. నిత్యం వరంగల్, ఖమ్మం ప్రాంతాల నుంచి రోజు రాకపోకలు సాగించే వివిధ శాఖల అధికారులు సిబ్బంది విధులకు హాజరవుతున్నారు. రైలు మార్గాన్నే ఎంచుకున్న అధికారులు ఆ రైళ్ల ఆలస్యమైతే విధులకు ఆలస్యంగా వస్తున్నారు. ఇందుకు నిదర్శనమే బుధవారం ఆదిలాబాద్ - తిరుపతి వెళ్లే కృష్ణా ఎక్స్‌ప్రెస్ నిర్ణీత సమయాని కంటే సుమారు 2.45 గంటల ఆలస్యంగా నడిచింది. ప్రతిరోజూ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు వచ్చే అధికారులు కూడా తమ కార్యాలయాలకు నిర్ణీత సమయానికి చేరుకోకపోడంతో వారి కార్యాలయాల్లోని కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఉదయం 9:23 గంటలకు మహబూబాబాద్ చేరుకోవాల్సిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ అనివార్య కారణాలతో మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకుంది. రైలులో వచ్చిన అధికారులు ప్రైవేట్ వాహనాల్లో హడావుడిగా తమ కార్యాలయాలకు చేరుకున్నారు. వివిధ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సుమారు మూడు గంటలకు ఆలస్యంగా హాజరయ్యారు. వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు వచ్చేదాకా వేచి ఉన్నారు.



ఖాళీగా ఉన్న జిల్లా ఉపాధికల్పనా అధికారి కుర్చీ



కలెక్టర్ కార్యాలయంలో ఆలస్యంగా వస్తున్న ఉద్యోగి



మధ్యాహ్నం ఆటో దిగి వస్తున్న ఉద్యోగులు

ఆధార్‌తోనే చెల్లింపులు.. వసూళ్లు

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధార్ అనుసంధానంతోనే ఎస్‌బీఐ చెల్లింపులు, వసూళ్లు చేపట్టాలని ఆర్బీవో ఛీఫ్ మేనేజర్ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఇందిరాసెంటరు ఎస్‌బీఐ బ్రాంచ్‌లో గ్రామ బిజినెస్ కరస్పాండెంట్ల సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న వ్యాపారుస్తులు, ఖాతాదారులు, డెబిట్‌కార్డులు తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎస్‌బీఐలో ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలన్నారు. అంతర్జాలంలోనే లావాదేవీలు చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న అమర్‌నాథ్

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నెల్లికుదురు(నెల్లికుదురు), న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ప్రణాళిక ప్రకారం కృషి చేసి, లక్ష్యాన్ని చేరుకోవాలని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలోని విద్యార్థినులకు ప్రభుత్వం అందించిన బెడ్‌షీట్లు, ట్రంక్ పెట్టెలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చదువుల్లో ఏకాగ్రత చూపుతూ, క్రీడల్లో రాణించాలని సూచించారు.



విద్యార్థినికి సామగ్రి అందజేస్తున్న అధికారులు

బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన


కేసముద్రం, న్యూస్‌టుడే: కేసముద్రం(వి) గ్రామంలోని బుధవారం బురద రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. గ్రామంలోని 8వ వార్డులో రోడ్లు పూర్తిగా బురదమయంగా మారాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఆగ్రహించిన స్థానికులు రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి మేకల వీరన్న, సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, వేముల సత్తిరెడ్డి, శ్రీనివాస్, రామడుగు వెంకటాచారి, మేకల లచ్చుమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంట మహిళలకు శిక్షణ

కేసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ వంట ఏజెన్సీ మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలు వీడియో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శాంతకుమారి, సమ్మెట వెంకటేశ్వర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటరు ఖాదర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పాఠశాలల మూసివేత

కొత్తగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్త నిర్లక్ష్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు మూసివేతకు గురవుతున్నాయని తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆగబోయిన రవి అన్నారు. బుధవారం కొత్తగూడలో ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ లేకపోవడంతో మూసివేతకు గురైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై సవతితల్లి ప్రేమను చూపిస్తుండటంతో అభివృద్ధికి నోచుకోకుండా మూసివేతకు గురవుతున్నట్లు చెప్పారు. దీంతో ఏజెన్సీలోని గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. ఇప్పటికైన విద్యావ్యవస్థను మరింత బలోపేతం కృషిచేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆలూరి రాజు, నగేష్, వాసం రవి, చిన్నరవి, బాలరాజు, దేవేందర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి

కేవీపీఎస్ మహాసభలు విజయవంతం చేయాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న కేవీపీఎస్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుర్ర మహేశ్ కోరారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. అంతేగాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల, మతపరమైన వివాదాలకు తావిచ్చేలా తమ విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ మహాసభలకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.రామ్మూర్తి, ఉపేందర్, జి.వెంకన్న, కొండల్, పాపయ్య, బీమా, అశోక్, పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో పూత, కాత లేక పెసర రైతులకు తీవ్ర నష్టం జరిగిందని నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ తెదేపా మండల అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఛత్రూనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 13 వందల హెక్టార్లలో పెసర పంట నష్టపోయినట్లు రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వారికి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా కార్యదర్శి భూక్యా సుమతి, మండల ప్రధాన కార్యదర్శి సుతారపు వెంకటనారాయణ, నాయకులు రాంరెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడదాం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు ఉద్యమించడానికి ప్రజలు సిద్ధం కావాలని బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు దార్ల శివరాజు కోరారు. బుధవారం ఇందిరాగాంధీ చౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు విషయంలో ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తే ఊరుకోమన్నారు. జిల్లా ప్రజలకు విద్యా, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే రెండు ప్రధానమైన సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో నాయకులు జి.సుమన్, జి.వీరన్న, నవీన్ పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమ్మె

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాలను నిరసిస్తూ ఎన్ఎఫ్‌పీఈ ఆధ్వర్యంలో బుధవారం తపాలా ఉద్యోగులు నిరసన తెలుపుతూ ఒక రోజు సమ్మెకు దిగారు. స్థానిక ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కె.గోపినాథ్ మాట్లాడుతూ నూతన పథకాల అమలు పేరుతో ఉద్యోగులపై అదనంగా పని భారం మోపుతున్నారని ఆరోపించారు. సాంకేతికను సాకుగా చూపుతూ మహిళా తపాలా ఉద్యోగుల పని భారం పెంచడాన్ని ఆయన నిరసించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, జీడీఎస్ ఉద్యోగుల కోసం కమలేశ్ చంద్ర కమిటీ సిఫారసులను సత్వరమే అమలు చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: దశాబ్దాల కాలంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం ఐకాస నాయకులు ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.మోహనాచారి, వివిధ మండలాల అధ్యక్షుడు ఎం.మోహనాచారి, బి.సత్యాహరి, డి.రాము పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఉప్పరపల్లి(కేసముద్రం), న్యూస్‌టుడే: ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పందుల యాకయ్య ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం ఉప్పరపల్లి గ్రామంలో మదర్‌థెరిస్సా గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో రూ.15000 ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి రూ.2వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి

మహబూబాబాద్ క్రైం, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏఆర్ సిబ్బందితో ఎస్పీ కోటిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెల్మెట్ ర్యాలీ విజయవంతంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతన జిల్లాలో సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని తెలిపారు. గణపతి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మహబూబాబాద్

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మహబూబాబాద్ గ్రామీణం: సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే శంకర్‌నాయక్ బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. చెక్కులు పొందిన వారిలో వెంకన్న, రజిత, నర్సయ్య, రాజమ్మ, ఉపేందర్ వీరన్న, రాములు, స్వర్ణలత, రవీందర్‌రెడ్డి, సంజీవ ఉన్నారు. కార్యక్రమంలో తెరాస నాయకులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనులు అస్తవ్యస్తం..!

గుంతలతో తరచూ ప్రమాదాలు

గూడూరు, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి తాగునీరందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పనులు గుత్తేదారు నిర్లక్ష్యంతో పనులు అస్తవ్యస్తంగా చేస్తున్నారు. బొద్దుగొండలో మొదలైన మిషన్ భగీరథ పనులు చిన్నఎల్లాపురం దాకా రోడ్డు పక్కన పైపులు వేశారు. బొద్దుగొండ నుంచి చిన్నఎల్లాపురం దాకా పంట పొలాల వద్ద గుంతలను పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. రైతుల భూములు సాగు చేసుకునే పరిస్థితి లేక నష్టపోతున్నారు. బొద్దుగొండ సమీపంలో మూడు తండా వద్ద గుంతలు తీసి పైపులు వేయడంతో రైతు బద్దు ఎకరా భూమిని సాగుచేసుకోలేక వదిలేశాడు. గూడూరు సమీపంలో మండల కుమార్, వేములపల్లి రమేష్ వారి వ్యవసాయ భూముల్లో నాట్లు వేసుకోలేదు. భూపతిపేట బస్టాండు ముందు, పాఠమిక పాఠశాల ముందు గుంతలు తీసి పూడ్చివేయకపోవడంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనిపై మిషన్ భగీరథ డీఈ సూర్యనాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వెంటనే గుత్తేదారుతో పనులు చేయిస్తామని తెలిపారు.


కాలువ తీసి వదిలేశారిలా..


భూపతిపేట బస్టాండ్‌లోకి వెళ్లకుండా గుంతలతో ఇలా..

పరిశీలన


మూడు తండా వద్ద సాగుభూమిలో...


అయోధ్యపురం సమీపంలో..

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులు యాంత్రీకరణ పథకంలో రాయితీపై ఇచ్చే యంత్రాల కోసం ఆయా మండలాల వ్యవసాయ కార్యాలయంలో సెప్టెంబర్ 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఏఓ ఛత్రూనాయక్ కోరారు. జిల్లాలోని 2017-18 సంవత్సరానికి గాను ప్రభుత్వం రాయితీపై వ్యవసాయం శాఖ పరిధిలోని రూ.8.66 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు.

మండల స్థాయి క్రీడాపోటీలు

కేసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఎస్జీఎఫ్ మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14, 17సంవత్సరాల లోపు బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక పాఠశాల నుంచి ఒక క్రీడ విభాగానికి ముగ్గురు విద్యార్థులు మాత్రమే హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా విజయవంతం చేయాలి

కల్వల (కేసముద్రం), న్యూస్‌టుడే: కేజీబీవీ ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 28న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సామ మల్లారెడ్డి అన్నారు. కల్వల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నేతలు రమేశ్‌కుమార్, రామ్‌దాస్, దుర్గాలక్ష్మి, రజిత, లావణ్య, స్నేహ, రహిమా తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల్లో రాజకీయ చైతన్యం రావాలి

గుండెంగ(గూడూరు), న్యూస్‌టుడే: మారుమూల గిరిజన ప్రాంతంలో యువకులు, విద్యావంతులు చైతన్యవంతులై రాజకీయంగా ఎదగాలని భాజపా గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు బానోత్ చందులాల్ అన్నారు. గుండెంగలో భాజపా గిరిజన మోర్చా గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. అధ్యక్షుడిగా బానోత్‌రమేష్, ఉపాధ్యక్షుడుగా భూక్య రవినాయక్, ప్రధానకార్యదర్శిగా భూక్య భాస్కర్, కార్యదర్శిగా జాటోత్‌రమేశ్, కోశాధికారిగా యాకుబ్‌నాయక్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై కళాబృందం ప్రదర్శన

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కళాకారులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. కాలుష్యం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కళాకారులు వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించిన కళారూపాలు పట్టణ ప్రజలను ఆకర్షించింది. పురపాలక సంఘం అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో మేనేజర్ రాజన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులు ఆపాలి

మహబూబాబాద్ క్రైం, న్యూస్‌టుడే: గత కొద్ది రోజులుగా ఆదివాసీలపై పోలీసులు దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వెంటనే దాడులు ఆపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి పాయం చిన్న చంద్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులను అణచివేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు జగ్గన్న, వెంకటేశ్వర్లు, బాస్కర్‌రెడ్డి, పైండ్ల యాకయ్య తదితరులు ఉన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శాంతికుమార్ కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు విద్యారంగంలో వెనుకంజలో ఉన్నారని ఆరోపించారు.

కేసముద్రం, న్యూస్‌టుడే: మానుకోట జిల్లాకు మంజూరైన గిరిజన విశ్వవిద్యాలయాన్ని మానుకోటలోనే నిర్మించాలని కోరుతూ భాజపా యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ధరావత్ శోభన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

మహబూబాబాద్, న్యూస్‌టుడే: గిరిజన విశ్వవిద్యాలయాన్ని మహబూబాబాద్‌లో ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ ఎ.రజనీకాంత్ మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం ఎంపీ సీతారాంనాయక్ ఈ విశ్వవిద్యాలయాన్ని తమ ప్రాంతానికి తీసుకెళుతున్నాడని ఆరోపించారు.

తప్పుడు ప్రకటనలు మానుకోవాలి

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: కొందరు ఉద్దేశపూర్వకంగా తనను లక్ష్యం చేసుకొని తప్పుడు ప్రకటనలు మానుకోవాలని మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని మహబూబాబాద్ నుంచి తరలిస్తున్నారని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు.

మట్టి ప్రతిమలనే వినియోగించాలి

మానుకోట, న్యూస్‌టుడే: మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ మహబూబాబాద్ డివిజన్ కురవి మండలం తాట్యాతండాకు చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రుడు బోడ వినోద్‌కుమార్ కరదీపికల ద్వారా విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.


విద్యార్థులకు కరదీపికలు అందజేస్తున్న వినోద్‌కుమార్

వినోద్‌కుమార్ 2015 సెప్టెంబర్‌లో పది రోజుల పాటు ఇదే విషయమై ప్రజలను చైతన్యపరిచేందుకు తెలంగాణ జిల్లాల్లో సుమారు 1050 కిలోమీటర్లు సైకిల్‌యాత్ర నిర్వహించారు. కృత్రిమ రసాయనాలు కలిసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసిన ప్రతిమల వల్ల జల కాలుష్యం కలుగుతోందని వివరిస్తూ ఆయన విద్యార్థులకు కరదీపికలను అందజేస్తున్నారు. బుధవారం వరంగల్‌లోని టీఎస్‌టీడబ్ల్యూఆర్ పాఠశాలలో, మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రచారం నిర్వహించానని ఇప్పటికే వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేస్తున్నట్లు వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

గంగారం, న్యూస్‌టుడే: గంగారం మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లోని యువజన సంఘాలకు బుధవారం గణపతి నవరాత్రి ఉత్సవాలపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ బాలకృష్ణ యువజన సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో గణపతి ఉత్సవాలు నిర్వహించుకునే వారు తప్పకుండా పోలీసు స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. మంచి వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

గణేశ్ నవరాత్రులకు అప్రమత్తతే ప్రధానం

పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రుల ఉత్సవాలలో పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. బుధవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీలు, ఏసీపీలతో సమావేశం నిర్వహించారు. గణపతి ఉత్సవాలకు పోలీసుశాఖ ద్వారా చేపట్టిన బందోబస్తు, నిమజ్జన కార్యక్రమాలకు తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి గణపతి మండపాలను పర్యవేక్షించడంతోపాటు మండపం ఏర్పాటుకు సూచనలను అందించాల్సి ఉంటుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గణేశ్ మండపాలకు పోలీసు సిబ్బంది ఇన్‌ఛార్జులను నియమించడంతో పాటు పగలు, రాత్రి సమయంలో వీలైనంత మేరకు పాట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుంచి ఏదైన ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించాలన్నారు. గణపతి మండపాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు అధికారులు మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకునేందుకు నిర్వాహకులతో చర్చించాలన్నారు. నగరంలోని పద్మాక్షిగుండం, కోట చెరువు, బంధం చెరువు, చిన్నవడ్డేపల్లి, ఉర్సు, కట్టమల్లన్న చెరువుల్లో నిర్వహించే నిమజ్జనం సమయంలో క్రేన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణేశ్ విగ్రహాలను తరలించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు లైన్లను పరిశీలించాలన్నారు. ఏదైన సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసుస్టేషన్ల వారీగా ఆర్టీసీ మెకానిక్‌లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఉత్సవ కమిటీలు డీజే సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటుకు అనుమతించవద్దన్నారు. గణపతి నవరాత్రుల నిమజ్జన కార్యక్రమం బందోబస్తులను వ్యక్తిగత శ్రద్ధతో పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ఈసమావేశంలో డీసీపీలు వేణుగోపాల్‌రావు, వెంకన్న, ఇస్మాయిల్,ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో తిరుగువారం పూజలు


సిద్ధం చేసిన పూజ సామగ్రి

తాడ్వాయి, న్యూస్‌టుడే: వన దేవతలు సమ్మక్క, సారలమ్మకు సంబంధించిన తిరుగువారం పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16న దేవతలకు పూజారులు పొట్ట పండగ నిర్వహించిన సంగతి తెల్సిందే. పొట్టపండగకు కొనసాగింపుగా పూజారులు దీన్ని నిర్వహించారు. పొట్టపండగ విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ ఉత్సవాన్ని పూజారులు సంప్రదాయ రీతిలో నిర్వహించారు. మేడారం, కన్నెపల్లిలలోని సమ్మక్క, సారలమ్మ దేవతల పూజామందిరాలను శుభ్రం చేశారు. దేవతల పూజాసామగ్రిని శుభ్రం చేసి దేవతలకు ధూప, దీప ఇష్ట నైవేద్యాలను సమర్పించారు. కుటుంబాల సమేతంగా పూజామందిరాలకు వచ్చి పండగను విజయవంతంగా నిర్వహించే శక్తిని ప్రసాదించిన దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. వచ్చే జాతరకు తమకు శక్తిని ప్రసాదించాలని వేడుకున్నారు. బుధవారం ఉదయం ప్రారంభమైన ఈ పూజలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. కార్యక్రమంలో పూజారులు సిద్దబోయిన మునీందర్, లక్ష్మణ్‌రావు, స్వామి, కాక సారయ్య, కిరణ్‌కుమార్, కొక్కెర కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆలయం ముందు ముగ్గులు వేస్తున్న పూజారి సతీమణి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

పర్వతగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌తో కలిసి శ్మశాన వాటిక నిర్మాణ పనులను ప్రారంభించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించడంతో పాటు జిల్లా పరిషత్తు పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ శ్మశానవాటిక పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలందజేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని అభివృద్ధి పనులు ప్రస్తుత తెరాస ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ఏఎంసీ వైస్ ఛైర్మన్ జితేందర్‌రెడ్డి, ఎంపీపీ రంగు రజిత, జడ్పీటీసీ సభ్యురాలు శైలజ, పర్వతగిరి, కల్లెడ సర్పంచి విజయలక్ష్మి, శ్రీనివాస్, తెరాస మండల అధ్యక్షుడు రాతన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ పేరుతో కొత్త నాటకం

తెరాస ప్రభుత్వంపై పొన్నాల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

రంగంపేట, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అబద్ధాలు, అసత్యాలతో కూడిన ప్రసంగాలు చేశారని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ పేరుతో కొత్త నాటకం మొదలు పెట్టారన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం ఇస్తానని నమ్మబలికి, మూడేళ్లు దాటినా ఇంతవరకు అమలు చేయలేదని, 84 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కొత్తగా చెబుతున్నా మూడేళ్లలో చేయలేనిది ఆర్నెల్లలో ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. నేషనల్ పోలీస్ అకాడమీకి 2013లోనే కాంగ్రెస్ ప్రభుత్వం దివంగత వెంకట్రామిరెడ్డి పేరును పెట్టగా తెలంగాణ పోలీస్ అకాడమీకి ఆయన పేరును తానే పెట్టానని ముఖ్యమంత్రి మాట్లాడటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను దశల వారీగా క్రమబద్ధీకరణ చేయాలని నిర్ణయించి తొలి, రెండో దశలు పూర్తయ్యే సమయానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెరాస అధికారంలోకి వచ్చాక మూడో విడత క్రమబద్ధీకరణ చేశామని, అయితే అవన్నీ తామే చేసినట్లుగా సీఎం అబద్ధాలు మాట్లాడటం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ పురస్కారం ఎందుకు ప్రకటించారో ఎవరికీ అర్థం కావడం లేదని, రైతుల ఆత్మహత్యలు, ఏకకాలంలో రుణమాఫీ, మద్దతు ధర ఇవ్వలేదని, వ్యవసాయ రంగాన్ని నాశనం చేసిన సీఎంకు కేంద్రం పురస్కారం ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత పాలకుల వల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందలేదని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటరు రింగురోడ్డు, మెట్రోల్ రైలు ప్రాజెక్టు కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయన్నారు. మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ మహా నగరాన్ని అభివృద్ధి చేస్తానని సీఎం కేసీఆర్ అన్నా 2013లో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను మూడేళ్ల పాటు అమోదించకుండా ఎందుకు జాప్యం చేశారని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ ఆధునిక మాస్టర్ ప్లాన్ అంటూ కొత్తది తయారు చేయాలన్నారు. 1972లో మాస్టర్‌ప్లాన్ నిబంధనలు అమలుచేయడం వల్ల నగర ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆరోగ్యం, పీసీసీ ప్రధాన కార్యదర్శి నమిండ్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజనాల శ్రీహరి, పీసీసీ కార్యదర్శులు ఈవీ.శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, అమృతరావు, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆర్థిక చేయూత..!

ట్రైకార్ ద్వారా జిల్లాకు రూ.30.37 కోట్ల మంజూరు

1781 మంది లబ్ధిదారులకు రూ.20.25 కోట్ల రాయితీ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: గిరిజనులకు స్వయం ఉపాధి కల్పించేందుకు గిరిజన సంక్షేమ శాఖ ట్రైకార్ సంస్థ ద్వారా జిల్లాకు రూ. 30.37 కోట్లు నిధులు మంజూరు చేసింది. వీటిలో రూ.20.25 కోట్లు రాయితీ అందనుంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల నిర్వహణతో పాటు ఇతర వ్యాపారాల నిర్వహణకు ఆర్థిక చేయూత పథకం(ఈఎస్ఎస్) ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు రాయితీతో రుణాలు అందించనుంది. ఈ పథకం కోసం 2017-18 ఆర్థిక సంవత్సరానికి లబ్ధిదారుల ఎంపికకు గిరిజన సంక్షేమ శాఖ షెడ్యూలును విడుదల చేసింది. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిందిగా జిల్లా గిరిజనాభివృద్ధి శాఖాధికారులను ఆదేశిస్తూ ఈనెల 7న గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.లక్ష్మణ్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని 1781 మంది గిరిజన లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. రైతులు, మత్స్య కార్మికులు, మహిళలు, నిరుద్యోగులకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు ట్రైకార్(గిరిజన సహకార ఆర్థిక సంస్థ)ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయనుంది. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం సెప్టెంబర్ 15 లోగా ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా అంతర్జాలంలో దరఖాస్తు చేసుకునే విధంగా షెడ్యూలును విడుదల చేసింది. ఈ పథకం ద్వారా గిరిజనులకు అందే రుణాలు, రాయితీలిలా ఉన్నాయి.

రాయితీ ఇలా..

రూ.లక్షకు 80 శాతం

రూ.2 లక్షల లోపు 70 శాతం

రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షల దాకా 60 శాతం



గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం

ఎంపిక ప్రక్రియ

సెప్టెంబర్ 15 లోగా వెబ్‌సైట్ ద్వారా అంతర్జాలంలో దరఖాస్తు చేసుకొని వాటి పత్రాలను మండల పరిషత్, పురపాలక కార్యాలయంలో అందజేయాలి.

అక్టోబర్ 15న మండల పరిషత్, పురపాలక కార్యాలయంలో మండల స్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

అక్టోబర్ 30న లబ్ధిదారుల జాబితాను పీవో, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రదర్శిస్తారు.

నవంబర్ 15న ఎంపికైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రాజెక్టు అధికారి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తారు.

నవంబర్ 30న లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాలను ఏబీఎంఎంఎస్ వెబ్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు.

డిసెంబర్ 15న లబ్ధిదారులకు రాయితీని విడుదల చేస్తారు.

2018 జనవరి 31న ఆయా విభాగాల అధికారులు, ఇతర శాఖల అధికారులు ఎంపికైన లబ్ధిదారులతో గ్రౌండింగ్ చేస్తారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక – టి.నారాయణస్వామి, జిల్లా గిరిజనాభివృద్ధి శాఖాధికారి

గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు ట్రైకార్ ద్వారా మంజూరు చేసే రుణాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తాం, అర్హులైన లబ్ధిదారుల ఎంపిక చేసి షెడ్యూలు ప్రకారం వారికి రాయితీతో కూడిన రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటాం. దళారులు ఆశ్రయించకుండా పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 15 లోగా అంతర్జాలంలో నిర్దేశించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించే లబ్ధిదారుల ఎంపికతో అర్హులైన గిరిజనులకు ఆర్థిక చేయూతనందిస్తాం.

వివిధ రంగాలు	లబ్ధిదారులు	రాయితీ (రూ.కోట్లల్లో)	బ్యాంకు రుణం (రూ.కోట్లల్లో)	లబ్ధిదారుడివాటా	మొత్తం (రూ.కోట్లల్లో)
వ్యవసాయం	446	రూ.5.33	రూ.2.56	-	రూ. 7.90
స్వయం ఉపాధి	509	రూ.7.47	రూ.3.79	-	రూ. 11.27
డ్రైవర్ ఎంపవర్‌మెంట్	46	రూ.2.30	రూ.2.07	రూ. 23 లక్షలు	రూ. 4.60
పాడి పరిశ్రమ	300	రూ.2.53	రూ.90.63 లక్షలు	-	రూ. 3.43
ఉద్యాన పరిశ్రమలు	175	రూ.1.40	రూ.35.00 లక్షలు	-	రూ.1.75
వృత్తి నైపుణ్య శిక్షణ	205	రూ.41.17 లక్షలు	-	-	రూ. 41.17 లక్షలు
మత్స్య పరిశ్రమ	100	రూ.80 లక్షలు	రూ.20 లక్షలు	-	రూ. 1.00

బాంబు స్క్వాడ్ తనిఖీలు

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని అన్ని ప్రార్థన మందిరాల పరిసరాల్లో బాంబు స్క్వాడ్ బుధవారం తనిఖీలు చేపట్టింది. వినాయక చవితి పండగ సమీపిస్తున్న దృష్ట్యా రక్షక భట శాఖ అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకుంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడటమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఒకవైపు అవగాహన సదస్సులు మరోపక్క బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలతో పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలనే సంకేతాలను ప్రజల్లోకి పంపిస్తున్నారు. అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే తమకు సమాచారం అందించాలని అన్ని వర్గాల ప్రజలకు దిశా నిర్ధేశం చేస్తున్నారు. ప్రార్థన మందిరాల పరిసరాల్లో తనిఖీలు నిర్వహించాక బాంబు స్క్వాడ్ బృందం పట్టణంలోని ముఖ్య కూడళ్లలోనూ పరిశీలన కొనసాగించింది. తనిఖీలను రక్షక భట నిలయం అధికారి నాగభూషణం పర్యవేక్షించారు

ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ

గూడూరు, న్యూస్‌టుడే: ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం మహిళా శిశు దివ్యాంగుల వయోవృద్ధుల కరీంనగర్ జిల్లా సంక్షేమ అధికారిణి(డీడబ్ల్యూవో) శారద పలువురిని విచారించారు. 2015 అక్టోబర్‌లో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే వృద్ధురాలు నూనె ప్యాకెట్లు తీసుకెళుతున్న క్రమంలో గ్రామస్థులు పట్టుకొని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా పీడీ ఇద్దరు ఉద్యోగులపై వేటువేశారు. దానిలో భాగంగానే బుధవారం విచారణాధికారిగా కరీంనగర్ డీడబ్ల్యూవో అధికారిణి శారద, సీడీపీవో జయంతి మరో ఇద్దరు ఉద్యోగులను విచారించారు. 2014 నుంచి 2016 దాకా జరిగిన కార్యాలయ రికార్డులను పరిశీలించారు. డీడబ్ల్యూవో శారద మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

విధుల నిర్వహణలో సమన్వయం లేకుంటే చర్యలు

గుండెపుడి(మరిపెడ),న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమన్వయం పాటించి విద్యాశాఖ ఆదేశాలు తప్పక పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. గుండెపుడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలి నడుమ సమన్వయ లోపం కారణంగా నెలకొన్న పరిస్థితిపై ఆయన స్వయంగా విచారణ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో సుమారు నాలుగు గంటలపాటు రహస్యంగా విచారణ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాలలో తనిఖీ నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మధ్యాహ్న భోజన నిర్వహణ సరిగా లేదని తమకు వారానికి మూడు రోజులు గుడ్డు పెట్టడం లేదని పిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సరైన పర్యవేక్షణ లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంట ఏజెన్సీ వారికి నిబంధనలు లిఖిత పూర్వకంగా అందజేసి మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఉన్నతాధికారి తనిఖీ


రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

మహబూబాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ సుమిత్‌మిశ్ర ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్‌లోని ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు జరగడంతో ప్లాట్‌ఫాం టికెట్ లేకుండా ఎలా ప్రయణిస్తున్నారని ఆగ్రహించారు. దీంతో సిబ్బంది పలువురిని అదుపులోకి తీసుకొని జరిమానా విధించారు. నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. రైల్వేస్టేషన్ ఆవరణలో ఉంటే ఫ్లాట్‌ఫాం టికెట్ తీసుకోవాలన్నారు. అనంతరం ఇక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతపై స్థానిక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఈ నెల 25 నుంచి 27 దాకా వరుసగా మూడు రోజులు వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఛైర్‌పర్సన్ మల్లెపాక పూజిత తెలిపారు. 28న మార్కెట్‌లో క్రయ విక్రయాలు సాగుతాయని ఆమె పేర్కొన్నారు.

ప్రైవేటు ల్యాబ్‌లపై వైద్య బృందం దాడులు

బయ్యారం, న్యూస్‌టుడే: స్థానిక ప్రైవేటు ఆస్పత్రులు, రోగనిర్ధారణ పరీక్ష కేంద్రాలను మహబూబాబాద్ జిల్లా వైద్య అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని నిర్వాహకులపై మండిపడ్డారు. బయ్యారం బస్టాండ్ సెంటర్ సమీపంలోని పరీక్ష కేంద్రంలో రక్త నమూనాలు సేకరించిన సూదులను రోజుల తరబడి నిల్వ చేయడం చూసి అవాక్కయారు. గాంధీసెంటర్, బస్టాండ్ సెంటర్‌లోని కేంద్రాల్లో అనుమతిలేని ఇతర పరీక్షలు నిర్వహిస్తున్నారనీ, తీరు మార్చుకోకపోతే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రుల్లో బెడ్‌ల ఏర్పాటును తొలగించాలని సూచించారు అత్యవసర చికిత్సలు చేస్తామని రాసి ఉన్న బోర్డులను తొలగించాలని సూచించారు. గర్భిణులకు పరీక్షలు చేయకూడదని పేర్కొన్నారు. బయ్యారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బృందం సభ్యులు మాట్లాడారు. మండలంలో హోమియోపతి వైద్యం చేయాల్సిన వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తున్నారని తెలిపారు. అనుమతులు లేకుండా రోగ నిర్ధారణ కేంద్రాలను అడ్డగోలుగా నిర్వహిస్తూ తప్పుడు రిపోర్టులు ఇస్తున్నారని ఆరోపించారు.

అంతర్రాష్ట్ర పోటీలకు అంఫైర్‌గా రాజేందర్

ఇనుగుర్తి(కేసముద్రం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 27 నుంచి 30 దాకా నిర్వహించనున్న సౌత్‌జోన్ అంతర్రాష్ట్ర బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అంపైర్‌గా కేసముద్రం మండలం ఇనుగుర్తి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేశ్‌కుమార్, రమేశ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

గార్ల, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలకే ప్రాధాన్యతను ఇవ్వాలి. భక్తులంతా ఈ దిశగా ఆలోచించాలని' గార్ల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పకుమారి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయినులు, విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు.

పత్తి కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలి

మానుకోట, న్యూస్‌టుడే: ఈ సంవత్సరం రాష్ట్రంలో పత్తి పంట విస్తీర్ణం పెరిగినందువల్ల పంట కొనుగోలుకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని వ్యవసాయ సాంకేతిక నిర్వహణ వ్యవస్థ (ఆత్మ) రాష్ట్ర కమిటీ సభ్యుడు సొల్లేటి జయపాల్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ఈసారి రాష్ట్రంలో పత్తి విస్తీర్ణం 11.8 హెక్టార్ల నుంచి 17.47 హెక్టార్లకు పెరిగిందన్నారు. పత్తి దిగుబడులు కూడా పెరగొచ్చని భావిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 92 పత్తి కొనుగోలు కేంద్రాలున్నాయని వీటి సంఖ్యను 150కి పెంచాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 కేంద్రాలు ఉన్నాయన్నారు. వరంగల్ రూరల్ జిల్లాలో పరకాల, నర్సంపేట, నెక్కొండ, మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ములుగు, వరంగల్ అర్బన్ జిల్లాలో వరంగల్-ఏ, బీ, జనగామలో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉన్నాయని అదనంగా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, చేర్యాల, ఏటూరునాగారం, మరిపెడల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. మార్కెట్‌లో పత్తి కొనుగోలు సమయంలో పత్తిని విడిగా (లూజ్) తీసుకురావాలని అడుగుతున్నారని... తెచ్చాక మార్కెట్ యార్డు నుంచి జిన్నింగ్‌మిల్లుకు తూకానికి పంపిన క్రమంలో రవాణా ఛార్జీలను కూడా రైతులకు బదులు సీసీఐ భరించాలన్నారు. గన్నీ బ్యాగుల్లో పత్తిని తేవద్దంటున్నారు... ఇందుకు అవసరమైన గుడ్డను సరఫరా చేస్తే మూటల్లో పత్తిని తెస్తారన్నారు. పత్తి కొనుగోలు జరిగాక 48 గంటల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చెల్లింపులు జరపాలన్నారు. తేమ శాతం 8 నుంచి 12 శాతం దాకా ఉంటేనే కొనుగోలుకు సమ్మతిస్తున్నారు..ఐతే 8 శాతం తేమతో తెచ్చేవారికి ధరపై ఒక శాతం బోనస్ ప్రకటిస్తే రైతులకు ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. ఇక ఈ ఏడాది పత్తి పంట సెప్టెంబర్ నెలలోనే వచ్చే అవకాశం ఉన్నందువల్ల సాధారణంగా అక్టోబర్ నెల నుంచి పంటకిచ్చే మద్దతు ధరను సెప్టెంబర్ నుంచే వర్తింపజేయాలని జయపాల్‌రెడ్డి కోరారు. ఈ విషయాలపై కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి స్మృతి ఇరానీకి ఒక వినతి పత్రం పంపామని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్తు శాఖ అనుమతులు తప్పని సరి

మహబూబాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: గణపతి నవరాత్రి ఉత్సవాల కోసం తప్పని సరిగా విద్యుతు శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని విద్యుత్తుశాఖ ఎస్ఈ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిలోవాట్‌కు రూ.1,406, వెయ్యి నుంచి 1500 కిలోవాట్‌కు రూ.2,085, 1,500నుంచి 2వేల కిలోవాట్‌లకు రూ.2,745 దాకా చెల్లించాలని పేర్కొన్నారు. అనుమతులు తీసుకుంటే సిబ్బంది వచ్చి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా భారీ విగ్రహాలు ఉంటే ముందస్తు సమాచారం ఇస్తే సిబ్బంది వచ్చి విద్యుత్తు లైను తగలకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

అందుకుంటూ గిన్నిస్ రికార్డు

తొలి గురువు తల్లి అంటారు.. ఈ నానుడి అక్షర సత్యం.. తన కూతురులోని సూక్ష్మ దృష్టి, మేధస్సును గుర్తించిన ఆ అమ్మ.. చిన్నారిలోని ప్రజ్ఞకు మరింత పదును బెట్టి ప్రపంచ స్థాయి రికార్డును సాధించే దిశగా వెన్నుతట్టి ప్రోత్సహించింది. చిరుప్రాయంలోనే గిన్నిస్ బుక్ రికార్డు అందుకునేలా ఆ చిన్నారిని నిమిషానికి 81 దేశాల పటాల గుర్తింపులో సఫలీకృతం అయ్యేలా శిక్షణ ఇచ్చింది. ఇక అందుకోవటమే తరువాయి అన్న రీతితో ఆ చిన్నారి మరింత సాధన చేస్తోంది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల వయసు కలిగిన గిరిజన విద్యార్థిని భూక్యా చిరుతేజ్ సింగ్ రాథోడ్ చేస్తున్న కృషి, ఆ చిన్నారికి లభిస్తున్న ప్రోత్సాహంపై 'న్యూస్‌టుడే' స్ఫూర్తిదాయక కథనం.

–మహబూబాబాద్, న్యూస్‌టుడే



నిమిషం వ్యవధిలో 81 దేశాల పటాలు గుర్తిస్తున్న 'చిరుతేజ'ం

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీటీఆర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులైన భూక్యా కిరణ్‌సింగ్- వసంత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. వారి రెండో కూతురే చిరుతేజ్‌సింగ్. ఎనిమిదేళ్ల వయసున్న ఈ చిన్నారి మూడో తరగతిలోనే సాంఘిక శాస్త్రంలోని భారత దేశం భౌగోళిక పటంలో అవుట్‌లైన్‌లో ఉన్న అన్ని దేశాల పేర్లను సులువుగా గుర్తిస్తుంటే ఆమె తల్లి పసిగట్టింది. తన కూతురులోని ప్రజ్ఞను పరిశీలించిన తల్లి వసంత తనయురాలి మేధస్సుకు మరింత పదును పెట్టాలని భావించింది. ఈ సమయంలోనే 'ఈనాడు'లో ప్రచురితమైన ఓ కథనం ఆమెను విశేషంగా ఆకర్షించింది. మహబూబాబాద్‌కు చెందిన ఉపాధ్యాయుడు చింతకుంట్ల కుమారస్వామి ఐదు నిమిషాల వ్యవధిలో ప్రపంచ పటాన్ని గీసి అందులోని ఆసియా ఖండంలో ఉన్న దేశాలను గుర్తించిన వైనం ఆ చిన్నారిని కూడా ఆకట్టుకుంది. దీంతో తాను కూడా రికార్డులు సాధించాలనే తపనతో ఉన్న ఆ చిన్నారి ఆ దిశగా అడుగులు వేసింది. తన తల్లి సహాయంతో ప్రపంచ భౌగోళిక పటంలో ఒక్కొక్క ఖండాన్ని వాటిలో ఉన్న దేశాలను గుర్తించింది. ఇలా ఐదు రోజుల వ్యవధిలోనే ప్రపంచ భౌగోళిక పటంలో ఉండే చిన్న చిన్న దేశాలతో సహా 236 దేశాల ఉనికిని ఠకీమని చెప్పే విధంగా గుర్తు పెట్టుకుంది.

పాఠశాలలోనే తొలి ప్రదర్శన

మహబూబాబాద్‌లో తను చదువుతున్న పాఠశాలలోనే తొలి ప్రదర్శన ఇచ్చింది. మూడో తరగతి చదువుతున్న చిరుతేజ్ సింగ్‌కు అప్పుడు ఎనిమిదేళ్ల వయస్సే. పది నిమిషాల్లోనే ప్రపంచ దేశాలు వాటి ప్రాముఖ్యత, నదులు, సముద్రాల ఉనికిని గుర్తించడం, భారతదేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానులు, రాష్ట్రాల ప్రాముఖ్యతను వివరించి ఉపాధ్యాయులను కూడా ఆశ్చర్యపరిచింది. తొలి ప్రదర్శనకు ప్రశంసలు అందడంతో మరో అడుగు ముందుకు వేసింది. తక్కువ సమయంలో ఎక్కువ దేశాలను గుర్తించడంపై గురిపెట్టింది. గతంలో ఉన్న రికార్డులను తన తల్లిదండ్రుల సాయంతో గూగుల్‌లో శోధించి తెలుసుకున్న చరణ్ తేజ్ సింగ్ వివిధ రికార్డుల సాధన కోసం కృషి నారంభించింది.

సాధించిన రికార్డులు ఇలా..

లిటిల్ బుక్ ఆఫ్ రికార్డు
బుక్ ఆఫ్ స్టేట్ బుక్ ఆఫ్ తెలంగాణ రికార్డ్సు:
స్టార్ వరల్డ్ రికార్డు

మూడు నిమిషాల వ్యవధిలోనే వరల్డ్ అవుట్ లైన్ మ్యాపులో గుర్తించిన రికార్డు

2017 ఫిబ్రవరి 13న జిల్లా కలెక్టర్ ప్రీతిమీన అధ్యక్షతన మహబూబాబాద్‌లో నిర్వహించిన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' ప్రదర్శనలో రెండు ప్రపంచ రికార్డులను నమోదు చేసుకుంది. ఒక్క నిమిషంలోనే ప్రపంచ భౌగోళిక పటం నందు 88 దేశాలను అతివేగంగా గుర్తించినట్లు దిల్లీకి చెందిన న్యాయ నిర్ణేత మనిష్ విష్ణోయ్ పర్యవేక్షణలో రికార్డు నమోదు చేశారు. అతి స్వల్ప వ్యవధిలో 2.38 నిమిషాల్లో వేగంగా 236 దేశాల గుర్తించినట్లు మరో రికార్డు సొంతం చేసుకుంది.

2017 ఫిబ్రవరి 19న హైదరాబాద్‌లోని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో ఒక్క నిమిషంలోనే 125 దేశాలను గుర్తించింది. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన వసుధ అశోక్ నుంచి రికార్డును అందుకుంది.



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పత్రాన్ని అందుకుంటున్న చిరుతేజ్(పాత చిత్రం)

మట్టి గణనాథులనే పూజిద్దాం

చిన్నారులు మొదలు పెద్దలు దాకా అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా చేసుకునే ఆనంద వేడుక వినాయక చవితి. ఈ పండగంటేనే ప్రకృతిని పూజించటం. వివిధ రకాల పత్రాలతో గణనాథుని పూజిస్తుంటాం. విఘ్నేశ్వరుని ప్రతిమను కూడా పర్యావరణహితంగా ప్రతిష్ఠించుకుంటే మేలనేది అందరి అభిమతం. తదనుగుణంగానే అనేక రాష్ట్రాల్లో వివిధ ఆకారాలు, రూపాల్లో మట్టి విఘ్నేశ్వరులను ప్రతిష్ఠించి పూజించడం చేస్తున్నారు. మన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఇదే విధమైన విజ్ఞప్తి చేశారు. తాజాగా కేంద్ర రసాయన, ఎరువులు, పార్లమెంటు వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ సైతం మట్టి గణనాథులను పూజించమని భక్తులకు విన్నవించారు. ఇంతమంది పెద్దలు, పూజ్యులు చెబుతున్న బాటనే మనం కూడా నడవాల్సిన అవసరం ఉంది. పర్యావరణ హితం కాంక్షిస్తూ వివిధ ప్రాంతాల్లో చవితి ఏర్పాట్లు ఎలా చేస్తున్నారో..'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, డోర్నకల్



పర్యావరణ హితులమవుదాం

పారుగు రాష్ట్రాల బాట అనుసరణీయం

పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం



కర్ణాటక

పర్యావరణానికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యనైనా కర్ణాటక ప్రభుత్వం తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఖానాపూర్ తాలూకాలో ఈసారి ప్లాస్టర్ పారీస్ ఆఫ్ (పీవోపీ) విగ్రహాల తయారీపై పూర్తి స్థాయిలో నిషేధం విధించింది. పర్యావరణ అనుకూల విగ్రహాల తయారీకే అనుమతిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. విగ్రహాల తయారీకి ఉపయోగించే మట్టి ఈ తాలూకాలో సమృద్ధిగా లభ్యమవుతుండటంతో ప్రభుత్వం ఇక్కడ వీటి రూపకల్పనకు మొగ్గు చూపింది. ప్రభుత్వ నిర్ణయంతో 300 మంది గ్రామీణ కళాకారులకు ఉపాధి లభించింది. వీరందరూ ఒకే గొడుగు కింద మట్టి గణనాథులను తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారైన విఘ్నేశ్వరుని విగ్రహం ఏ ప్రాంతంలో కొనుగోలు చేసినా ఒకే ధరకు లభించే సదుపాయం కల్పించారు. ఖానాపూర్ తాలూకా పరిధిలోని గురుగ్నుంజి, నగర్గలి, నందగడ్ గ్రామాలు మట్టి విగ్రహాల తయారీకు మొదటి నుంచి పెట్టింది పేరు. ఇక్కడి విగ్రహాల కొనుగోలుకు గోవా నుంచి ముందస్తు ఆర్డర్లు రావడం చూస్తే పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లోను ఆదరణ ఉందనే విషయం తేటతెల్లమవుతుంది. రూ.1200 నుంచి గరిష్ఠంగా రూ.5 వేలు వరకు ధర ఉంటుంది. ప్రభుత్వ చర్యను పీవోపీ విగ్రహ తయారీదారులు ప్రతిఘటించే ప్రయత్నం చేసినా వారి పప్పులేం ఉడకలేదిక్కడ.


ప్లాస్టిక్ సంచుల వాడకంపై కట్టడి



ఉత్తర్‌ప్రదేశ్

ఉత్తరప్రదేశ్‌లో ఇది పేరొందిన ఆశ్రమం. ఇక్కడ వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవడానికి అధిక ప్రాధాన్యమిస్తారు. సాయి ఆశ్రమం నిర్వాహకులు మట్టి గణనాథులను ప్రతిష్ఠించి నిత్య పూజలు, ఆరాధనలు ఉంటాయి. పర్యావరణ పరిరక్షణ గూర్చి భక్తులను చైతన్య పరుస్తుంటారు. విఘ్నేశ్వరుని మండపం వద్దకు పూజా సామగ్రి, ఇతర వస్తువులు తీసుకుని రావడానికి ప్లాస్టిక్ సంచులు అనుమతించరు. ఒకవేళ తెలిసీ తెలియకో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించి ఆ మొత్తాన్ని వారి చేతులతో అక్కడే హుండీలో వేయిస్తారు. దీంతో ప్లాస్టిక్ సంచుల వినియోగం మానేశారక్కడ.

రెండో ఆలోచనకు తావివ్వరు



గోవా

పర్యావరణ హితానికి పెట్టింది పేరు గోవా. ఇక్కడ ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా రెండో ఆలోచనకు తావివ్వరు. వినాయక చవితిని 'ఛౌవత్' పేరిట పాటిస్తారు. వేరొకరి చేత చెప్పించుకోరు. ఎవరికి వారు మట్టి గణనాథులనే ప్రతిష్ఠించి పూజలు చేస్తుంటారు. వివాహిత మహిళలు విధిగా రెండున్నర రోజులు ఉపవాసం పాటిస్తారు. విఘ్నేశ్వరుడితో పాటు గౌరీ, మహాదేవ్ ప్రతిమలను పూజించడం ఇక్కడి ప్రత్యేకత. కాగితంపై గౌరీ చిత్రపటం గీసి టెంకాయని శివుడిగా పరిగణిస్తారు. పర్యావరణం పరిరక్షణ ఆవశ్యకత గూర్చి ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి గౌరీ, మహదేవ్, గణపతి రూపాలు పోలిన ఆకులను సేకరించే పని బాలికలకు అప్పగిస్తారు. ఒక విధంగా వారికిది పోటీ.

ఆవు పేడ గణేశులకు ఆదరణ



మహారాష్ట్ర

మునుపెన్నడూ లేని విధంగా ఇక్కడ ఈసారి ఆవు పేడతో తయారు చేసిన గణేశ్ విగ్రహాలకు ఆదరణ లభిస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే ఇవే ప్రాచుర్యం పొందాయి. ఛో ఆశ్రమం నడుపుతున్న నేరుల్ వాసి నీలేశ్ టుపే అనే వ్యక్తి ఆలోచనకు ప్రతిరూపం ఈ తరహా ప్రతిమలు. ఇతను తనకు అవసరమైన ముడి సరకుని రాజస్థాన్‌లోని గోశాలల్లోంచి సమకూర్చుకుంటున్నారు. ముంబై కేంద్రంగా ఆవు పేడ గణనాథుల అమ్మకాలకు ప్రధాన పంపిణీదారుడి అవతారమెత్తారు. స్నేహితుల ప్రోద్బలంతో టుపేలో ఈ మేలుకొలుపు సాధ్యమైంది. ఆవు పేడ గణనాథులను ఎంచక్కా ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేసుకునే వీలుంది..

బొజ్జలో విత్తనాలతో గణపయ్య ప్రతిరూపం



ముంబయి

దేవుడు అంతటా ఉన్నారనే ఆలోచనను ఆచరణలో పెట్టి నిరూపించాలనే ఆలోచన చేశాడు ముంబయికి చెందిన దత్తాద్రి కొఠూర్. ఇతను ఒక సంస్థలో సీనియర్ ఆర్ట్ డైరెక్టర్. గణనాథుడిని నీటిలో నిమజ్జనం చేయడమే కాదు గణనాథుడిపైనా నీటిని పోయడం ద్వారా కూడా నిమజ్జనం చేయొచ్చనేది ఇతని సంకల్పం. దీనికితోడు ఇంకేదైనా ప్రయోజనం ఒనగూరితే బాగని తలచాడు. వెంటనే బొజ్జతోపాటు తొండంలో విత్తనాలతో మట్టి విగ్రహాలకు రూపమిచ్చారు. వీటిని పూజించాక ఒక తొట్టిలో ఉంచి పైనుంచి నీరు పోస్తే విగ్రహం కరుగుతుంది. ఆ తర్వాత అందులోని విత్తనాలు క్రమేసీ మొలకెత్తుతాయి. ఇంటి ఆవరణలో నిత్యం దేవుడిని చెట్టు రూపంలో చూసుకోవచ్చని, గణనాథుడు మన కళ్లెదుట జీవంతో ఉన్నట్లే కదానని కొఠూర్ ఆలోచన.

మా పంట.. మా వంట

మధ్యాహ్న భోజనానికి అక్కడ పండే కూరగాయలే!

ఉనికిచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదర్శం

రాష్ట్ర స్వచ్ఛ విద్యాలయ్ పురస్కార్‌కు ఎంపిక

ఎటు చూసినా పచ్చదనం..ఏపుగా పెరిగిన వందలాది భారీ చెట్లు.. ఆకుకూరలు, ఇతర కూరగాయల పంటలు.. బాలబాలికలకు వేర్వేరు మరుగుదొడ్లు, చెంత కుళాయిలు, చేతులు శుభ్రం చేసుకునే సబ్బు.. చెత్త వేయడానికి బుట్టలు.. ఇలా ఎంతో పరిశుభ్రంగా కనిపించే ఆ బడిని చూస్తే కార్పొరేట్ పాఠశాలలా కనిపిస్తుంది. కాని అది ప్రభుత్వ ఉన్నత పాఠశాల అంటే ఆశ్చర్యపోకమానం. అందుకే అది రాష్ట్ర స్థాయి స్వచ్ఛ విద్యాలయ్ పురస్కార్‌కు ఎంపికైంది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకల్లో విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా జిల్లా స్థాయి స్వచ్ఛ విద్యాలయ్ అవార్డును కూడా పొందారు. ఈ పాఠశాలలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తుంటారు. ఎక్కువగా పండితే అమ్మి ఆ డబ్బును పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేస్తుంటారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఉనికిచర్ల పాఠశాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

–న్యూస్‌టుడే, ధర్మసాగర్



పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదంగా కనిపిస్తున్న ఉనికిచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల



పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

అందమైన ఆశ్రమంలా..

ఉనికిచర్ల ఉన్నత పాఠశాల పరిశుభ్రతకు మారుపేరుగా ఉంటుంది. విశాలమైన ప్రహరీ కల్గి 20 రకాలైన వేయి చెట్లతో నిండి ఒక అందమైన వనాన్ని తలపిస్తుంది. ప్రశాంతతకు నిలయంగా, ఓ ఆశ్రమంలా కనిపిస్తుంది. నీడనిచ్చేవాటితోపాటు, పండ్ల చెట్లు, భవిష్యత్తులో ఆదాయాన్నిచ్చే చెట్లూ ఇక్కడ కనిపిస్తాయి. వీటి మధ్యనే ఆకు కూరలైన పాలకూర, చుక్క కూర, గోంగూర, బచ్చల కూర వంటి పలు రకాల ఆకుకూరలను సాగు చేస్తున్నారు. బెండకాయ, వంకాయ, టమాట, సొరకాయ వంటి కాయగూరలను పండిస్తున్నారు. ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ వంటి రకాలు కూడా ఇక్కడ కనిపిస్తాయి. దాదాపు 105 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి ఇక్కడ పండేవి సరిపోతుంటాయి. సాగు చేస్తూ వాటిని మధ్యాహ్న భోజనానికి వీటినే వాడుతుంటారు. పాఠశాలకు సరిపోయిన తర్వాత మిగతా వాటిని గ్రామస్థులకు విక్రయిస్తుంటారు. వీటితో వచ్చిన మొత్తాన్ని పాఠశాల ఖర్చులకు వాడుతుంటారు.

ఆధునిక పద్ధతిలో విద్యాబోధన

విద్యార్థులకు ఆట పాటలతోపాటు, ప్రయోగాత్మక విద్యను బోధిస్తుంటారు. పని విద్య, సృజనాత్మక విద్య, డిజిటల్ క్లాసులతో విద్యాబోధన ఉండటంతో పిల్లలూ ఆసక్తిగా రోజూ బడికి వస్తుంటారు. విద్యార్థినులకు టాయ్స్, అల్లికల వంటివి పలు రకాల వస్తువుల తయారిని నేర్పిస్తుంటారు. ప్రతి వారం ఎన్‌జీసీ కార్యక్రమం. నేషనల్ గ్రీన్ కార్ప్స్‌తో మొక్కలను పెంచే దానిపై విద్యార్థులకు వివరిస్తుంటారు. వినాయకచవితికి మట్టి విగ్రహాలనే వాడాలనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించటమే కాదు.. గ్రామస్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా చేస్తుంటారు.



జిల్లా స్వచ్ఛ విద్యాలయ్ పురస్కారాన్ని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు జితేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్, డీఈవో శ్రీనివాసాచారి(పాత చిత్రం)

నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి

–అయేషా ఫాతిమా, 9వ తరగతి



పచ్చని చెట్ల మధ్య మా బడి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. ప్రతి విద్యార్థికి ఏదో ఒక బాధ్యత ఇవ్వడం వలన మాలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. చదువుతోపాటు సమాజం అంటే ఏమిటో తెలుస్తుంది. ప్రైవేటు పాఠశాలలో కూడా ఇలాంటి విద్యా బోధన, వాతావరణం ఉండదు. ఈ పాఠశాలలో చదువుకోవడం మా అదృష్టం.

ఇక్కడి కూరగాయలు మాకే

–సీహెచ్. శిరిష, పదో తరగతి



మా పాఠశాల ఆవరణలో పండిన కూరగాయలను మేమే వినియోగించుకుంటున్నాం. ఎలాంటి రసాయన మందులను వేయకుండా వాటిని పండించటం వలన ఎంతో రుచికరంగా కూరలు ఉంటాయి. మూడు నాలుగు సంవత్సరాలుగా ఇలాగే చేస్తున్నాం. పాఠశాల సంరక్షణ బాధ్యతలు కూడా మాపైనే ఉన్నందున ఎంతో అపురూపంగా చూసుకుంటాం.

చాలా సంతోషంగా ఉంది

–జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రతను మూడేళ్లుగా పాటిస్తున్నాం. దీని కోసం మా ఉపాధ్యాయ బృందం, పాఠశాల యాజమాన్య కమిటీ, విద్యార్థులందరి సహకారంతో స్వచ్ఛ పాఠశాలగా మార్చుకున్నాం. దీంతో రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైంది. దీనికి చాలా సంతోషంగా ఉంది. ఇటీవల జిల్లా స్వచ్ఛ్ విద్యాలయ్ పురష్కార్ అవార్డును మంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా తీసుకున్నాం. మా అందరి కృషి దీనివెనుక ఉంది.

అద్భుతం.. ఏకశిల సర్వతోభద్ర ఆలయం!

జయశంకర్ జిల్లా చిట్యాల మండలం నైన్‌పాకలో అపురూప కట్టడం

గ్రామస్థుల చొరవతో వెలుగులోకి..

రూ. 3 కోట్ల నిధులు కేటాయింపు

త్వరలోనే పనులకు శ్రీకారం

సర్వే చేపట్టనున్న పురావస్తు శాఖ

జయశంకర్ భూపాలపల్లి: చిట్యాల, న్యూస్‌టుడే

ఒక్కో ఆలయానికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది... ఒకటి ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తే.. మరొకటి ఆహ్లాదకర వాతావరణాన్ని పంచుతుంది.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాకలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నాపాక ఏకశిల సర్వతోభద్ర కోవెల మాత్రం కలకాలం గుర్తుండిపోయే మధురానుభూతిని ఇస్తుంది.. ఒకే శిలపై నాలుగు వైపులా దేవతా విగ్రహాలు ఉన్నాయిక్కడ. సుందరమైన శిల్పకళా వైభవంతో పాటు, మహిమాన్విత్వ గుడికి తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి స్థానికులు, స్పీకర్ మధుసూదనాచారి కృషి చేస్తున్నారు.



నైన్‌పాక గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో నాపాక ఏకశిల సర్వతో భద్ర ఆలయం ఉంది. గుడికి నాలుగు ముఖద్వారాలున్నాయి. నాలుగు వైపులా దేవతా విగ్రహాలున్నాయి. తూర్పువైపున శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, పడమర వైపు విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, ఉత్తరం వైపున రాముడు, సీత, లక్ష్మణుడు, దక్షిణం వైపు శ్రీకృష్ణ, రుక్మిణి, సత్యభామ విగ్రహాలున్నాయి. వీటితో పాటు ద్వారపాలక , మూడు వైపులా గరుత్మంతుడు, హనుమాన్, మత్స్య విగ్రహాలు కొలువుదీరాయి. అన్నింటినీ ఒకే శిలతో చెక్కారు. రాతితో నిర్మించిన ఆలయం పైభాగంలో గాలిగోపురం సుమారు 50 అడుగుల ఎత్తులో ఉంది. చుట్టూ కోనేరు, చెరువు, రచ్చబండ, వరుణకొండ, స్వామివారి పాదుకలు, ఇతర నిర్మాణాలు ఉన్నాయి. ఇటీవల కోవెలను సందర్శించిన కేంద్ర, రాష్ట్ర పురావస్తు , దేవాదాయ, ధర్మాదాయ, పర్యాటక శాఖ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



పడమరన శ్రీవిష్ణువు, లక్ష్మీదేవి విగ్రహాలు

కదలిన గ్రామస్థులు..

ఆలయ విశిష్ఠతను గుర్తించిన గ్రామస్థులు దాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏడాదిన్నర క్రితం 30 మందితో కమిటీ ఏర్పాటు చేసుకుని విరాళాలు సేకరించారు. చేయాచేయా కలిపి శుభ్రం చేశారు. హద్దులు ఏర్పాటు చేయించారు. అర్చకులను నియమించారు. జనవరి 8న వైకుంఠ ఏకాదశి రోజున వైభవంగా జాతరను జరిపారు. అప్పటి నుంచి గుడి గురించి అందరికీ తెలిసింది.

పూర్వవైభవానికి కృషి

స్పీకర్ మధుసూదనాచారి ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయ అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరు చేయించారు. తర్వాత సింగరేణి యాజమాన్యం రూ. 50 లక్షలు, పాలనాధికారి రూ. 50 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రూ. మూడు కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు అభివృద్ధి కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. ఇటీవల విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించారు.

సర్వేతో మరింత సమాచారం

13వ శతాబ్దంలో కాకతీయులే కోవెలను నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. తాళపత్ర గ్రంథాలు గానీ, శాసనాలు గానీ లేవు. ఇది కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖల ఆధీనంలో లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పురావస్తు శాఖ సర్వే చేపట్టాలని నిర్ణయించింది. తవ్వకాల ఆధారంగా లభించే వస్తువుల వల్ల ఎప్పటి కాలంలో నిర్మించారో స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. చారిత్రక వివరాలు వెలుగులోకి రానున్నాయి.

ఏకశిలపై నాలుగు వైపులా దేవతామూర్తులుండడం ప్రత్యేకత


– ప్రభాకర్, ఆలయ అర్చకుడు



ఆలయానికి నాలుగు ముఖద్వారాలు ఉండటంతో పాటు, ఏకశిలపై నాలుగు వైపులా దేవతా మూర్తులు ఉండటం ప్రత్యేకత. ఇది దక్షిణ భారతదేశంలోనే అరుదైన విషయం. మూల విరాట్టు ఎంతో గంభీర్యాన్ని సంతరించుకుని ఉంటుంది. స్పీకర్ చొరవతో అభివృద్ధి ప్రణాళికలు చేస్తున్నారు.

వాసన పట్టి.. పరిసరాలను పసిగట్టి..

నేర పరిశోధనలో సహకరిస్తున్న శునకాలు



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: సాధు జంతువు శునకాలలో చాలా జాతులు ఉన్నాయి. ఇందులో జర్మన్ షెప్పర్డ్, డాబర్‌మెన్ జాతికి చెందిన శునకాలు పోలీసుల నేర పరిశోధన కోసం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఈ జాతివి చాలా తెలివిగా వ్యవహరిస్తాయి. వేగంగా స్పందిస్తాయి. వాసనతోనూ సులభంగా పసిగట్టి నిందితులను గుర్తించేందుకు దోహదపడుతున్నాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సుశిక్షుతులైన సుమారు 20 శునకాలు ఉన్నాయి. వీటిని కంటికి రెప్పలా కాపాడేందుకు పదిహేను మంది సిబ్బంది వరకు పని చేస్తుంటారు. వీటిని ఎలా పర్యవేక్షిస్తారు. అవి ఎలా స్పందిస్తుంటాయో 'న్యూస్‌టుడే' కథనం.

సంరక్షణ ఇలా..

రోజూ వీటికి ప్రోటీన్లతో కూడిన పోషకాహారాన్ని అందిస్తుంటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతారు. నిత్యం స్నానం చేయిస్తారు. అవసరం మేరకు రకరకాల వ్యాక్సిన్స్‌ను ఇప్పిస్తుంటారు. శునకాల కోసం కేటాయించిన కంపెనీలకు చెందిన ఆహార పదార్థాలు ఇస్తారు. ఒక్కో కుక్కకు రోజుకు రూ.500 నుంచి రూ.750 వరకు ఖర్చు చేస్తారు. స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తారు. మాంసాహారం కూడా వీటికి ఇస్తుంటారు. చిన్న పిల్లల వలే వీటిని జాగ్రత్తగా చూస్తుంటారు. ఇలా నిర్వహణ ఉంటేనే నేర పరిశోధనలో పూర్తిగా సహకరిస్తాయనేది పోలీసుల భావన. ఏదైన చిన్న జబ్బు చేసిన వెంటనే వైద్యం చేయిస్తారు. నేరస్థులను గుర్తించడంలో శునకాల పాత్ర చాలా కీలకంగా మారుతోంది. పోలీసుశాఖలో దీనికి ప్రత్యేక విభాగం ఉంది. కీలకమైన కేసులను శునకాల సహాయంతోనే పోలీసులు ఛేదిస్తున్నారు. ఇవి నమ్మిన బంటుల్లా పని చేస్తుంటాయి. నేరం జరిగిన తర్వాత అక్కడ పరిస్థితులను బట్టి డాగ్ స్క్వాడ్‌ను పోలీసులు తీసుకొస్తారు. ఇవి వాసన చూస్తాయి. అక్కడ నుంచి నిందితుడు ఎటు వైపు వెళ్లాడో పసిగడతాయి. నిందితుడిని పట్టుకునేందుకు ఇవి ప్రయత్నిస్తాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించిన సంఘటనలున్నాయి. జిల్లాలో సుమారు 200 కేసులను ఛేదించేందుకు శునకాలు పోలీసులకు సహకరించాయని అధికారులు చెబుతున్నారు.

ప్రముఖుల పర్యటన సమయాల్లో..

ముందుగా బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్లతో ఆ ప్రాంతాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ముందుగా నేతల పర్యటనలకు సంబంధించిన స్థలాలు ఖరారైన తర్వాత శునకాలతో తనిఖీలు నిర్వహిస్తారు. అక్కడ ఏమైన హానికరమైన పేలుడు పదార్థాలు ఉంటే ఇవి ముందస్తుగా గుర్తిస్తాయనేది వీరి ప్రగాఢ విశ్వాసం. బాంబులను గుర్తించడంలో కూడా వీటికి ఇచ్చిన ప్రత్యేక శిక్షణతో బాంబును పసిగడతాయి. ఒకవేళ బాంబులు ఉంటే వెంటనే బాంబు స్క్వాడ్ వీటిని నిర్వీర్యం చేస్తుంది.

ప్రత్యేక శిక్షణ..

హైదరాబాద్‌లో శునకాలకు వివిధ అంశాలలో శిక్షణ ఇస్తారు. ఇవి వాసన గుర్తించి, నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వారి వద్దకు వెళ్లి వారిపై దాడి చేయకుండా ఉండేందుకు నిపుణులు వీటికి తర్ఫీదు ఇస్తారు. శునకాలను ఎలా పెంచాలి.. వాటితో ఎలా ఉండాలనే అంశాలపై నిపుణులు సిబ్బందికి వివరిస్తారు. 10 రోజుల నుంచి 30 రోజుల వరకు పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తారు. శిక్షణ తీసుకున్న తర్వాత జిల్లా పోలీసు కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తారు. అవసరం మేరకు ఇలా చేసిన వాటిని సిబ్బందికి ఇచ్చి అవసరం మేరకు పోలీసులు నేర పరిశోధనలో ఉపయోగించుకుంటున్నారు.

గత నెలలో మిల్స్‌కాలనీ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి పాఠశాలకు వెళ్లే విద్యార్థిని హత్య చేశాడు. స్థానికంగా ఉండే ఆటోలో వేసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఆటో డ్రైవర్ ఉదయం చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు శునకాలను తీసుకొచ్చి ముందుగా నిందితుడు పారిపోయిన మార్గాన్ని కనుగొన్నారు. తర్వాత విచారణ చేసి నిందితుడిని పట్టుకున్నారు.

మూడు నెలల క్రితం కాకతీయ విశ్వవిద్యాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలు జరిగాయి. ఇందులో నిందితులను పట్టకునేందుకు పోలీసులు శునకాలను ఉపయోగించారు. ఇలా పలు కేసులలో నిందితుల ఆచూకీ పోలీసులకు అందిస్తున్నాయి.

కమిషనరేట్ పరిధిలో బాంబ్ స్క్వాడ్స్ సిబ్బంది శునకాలను నిత్యం పర్యవేక్షిస్తుంటారు. ప్రతి పోలీసుస్టేషన్‌కు వెళ్లి తనిఖీ చేస్తుంటారు.

డ్రైవింగ్ రాకుండానే ఉరికించాడు..

భద్రకాళి ఆలయ ఆవరణలో ఘటన ఆరుగురికి గాయాలు



భక్తులపైకి దూసుకెళ్లిన కారు

రంగంపేట, న్యూస్‌టుడే: కొత్త కారును కొనుగోలు చేశారు.. భక్తితో భద్రకాళి అమ్మవారి సన్నిధిలో పూజలు చేయాలని ఆలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు.. అనంతరం కారు యాజమాని ప్రప్రథమంగా స్టీరింగ్ పట్టారు. అంతే క్షణల్లోనే కారు ఉరికింది. అదుపుతప్పి భక్తులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. బాధితుల్లో ఒకే కుటంబానికి చెందిన నలుగురు, ఆలయం వద్ద భిక్షాటన చేసే మహిళతో పాటు రెండేళ్ల నవీన్ చందర్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. కారు బీభత్సానికి మూడు ద్విచక్ర వాహనాలు, మరో కారు కాస్త ధ్వంసమయ్యాయి. రెప్పపాటులో జరిగిన ఈ సంఘటనలో ఒక్కసారిగా భక్తులు తలోదిక్కుకు పరుగులు తీశారు. కారు నడిపిన యజమానికి డ్రైవింగ్ రాదని, పూజలు చేసిన తర్వాత అర్చకుడు సూచించిన మేరకు స్టీరింగ్ పట్టారని తెలిసింది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. హన్మకొండ పోస్టల్‌కాలనీకి చెందిన శివాజీ మారుతీ బ్రెజా మోడల్ కారు కొనుగోలు చేశారు. బుధవారం ఉదయం భద్రకాళి అమ్మవారి ఆలయంలో పూజలు చేయించాలని డ్రైవరుతో సహా కుటుంబ సభ్యులతో వచ్చారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని కొత్త కారుకు అర్చకునితో పూజలు చేయించారు. ఆయన కారు చక్రాల కింద నిమ్మకాయలు పెట్టి ముందుకు తీయాలని కోరారు. దీంతో తానే డ్రైవింగ్ చేస్తానని శివాజీ ఇంజిన్ స్టార్ట్ చేసి గేర్లు వేసి ఎక్స్‌లెటర్‌పై కాలు వేశారు. అంతే అది ఒక్కసారిగా ముందుకు ఉరికింది. ద్విచక్ర వాహనాలు, మరో కారును ఢీకొని అమ్మవారిని దర్శించుకొని వెళ్తున్న భక్తులపై దూసుకెళ్లింది. ప్రమాదంలో భూపాలపల్లి పట్టణానికి చెందిన వీరన్న (47), గోపమ్మ (44), రెండేళ్ల బాలుడు నవీన్‌చందర్, యాచకురాలు వాణి తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నవీన్‌చందర్‌కు తీవ్రంగా రక్తస్రావం కావడంతో దేవస్థానం ఉద్యోగులు హుటాహుటిన ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







గాయపడిన రెండేళ్ల బాలుడు నవీన్‌చందర్, గోపమ్మ, బాధితుని నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసు

బావిలో పడి వృద్ధురాలి మృతి

పరకాల రూరల్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ఓ వృద్ధురాలు బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కామారెడ్డిపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్థుల, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కామారెడ్డిపల్లికి చెందిన పిల్లల లచ్చమ్మ(80) అనే వృద్ధురాలు మంగళవారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతికారు. రాత్రి 7 గంటల సమయంలో లచ్చమ్మ స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న మంచినీటి బావిలో పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఈ మేరకు పరకాల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికి తీశారు. ప్రమాదవశాత్తు లచ్చమ్మ బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

నగదు గల్లంతు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఏటీఎం ద్వారా డబ్బులను విడిపించే క్రమంలో రూ.17 వేల నగదు గల్లంతవడంతో ఓ ఖాతాదారుడు ఖంగుతిన్న సంఘటన దంతాలపల్లిలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం... ఆగాపేట శివారు తూర్పుతండాకు చెందిన గుగులోతు రాందన్ అనే వ్యక్తి ఈ నెల 1న స్థానిక ఆంధ్రాబ్యాంకు ఏటీఎంలో రూ.15 వేల నగదును విడిపించుకునేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రూ.15 వేల నగదు తీసుకున్నట్లు రశీదు మాత్రమే వచ్చిందని నగదు బయటకు రాలేదన్నారు. ఈ నెల 20న తొర్రూరులోని మరో ఏటీఎం కేంద్రంలో రూ.2500 విడిపించుకునేందుకు వెళ్లగా మరోసారి రశీదు వచ్చిందే తప్పా నగదు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో రూ.17 వేల నగదు గల్లంతైనట్లు గుర్తించాడు. జరిగిన విషయంపై పోలీసుస్టేషన్, ఆంధ్రాబ్యాంకులో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రాయితీ గొర్రెలు విక్రయిస్తున్న ఐదుగురిపై కేసు

కేసముద్రం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయితీపై అందించిన గొర్రెలను విక్రయిస్తున్న సంఘటనలో ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మహమూద్‌పట్నం శివారు మూడావత్‌తండా నుంచి ప్రభుత్వం రాయితీపై ఇచ్చిన గొర్రెలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లగా వాహనంలో 60 గొర్రెలు తరలిస్తున్నారు. మహమూద్‌పట్నం గ్రామానికి చెందిన తొగరి నవీన్, తొగరి ఐలయ్య, యాకబోయిన వెంకన్నలు తమకు ప్రభుత్వం రాయితీపై అందించిన గొర్రెలను జతకు రూ.7వేలు చొప్పున తిరుమలగిరికి చెందిన శ్రీశైలంకు విక్రయించారు. రాయితీపై అందించిన గొర్రెలను విక్రయించిన ముగ్గురు వ్యక్తులతోపాటు గొర్రెలను ఖరీదు చేసిన తిరుమలగిరికి చెందిన శ్రీశైలం, తరలిస్తున్న రాజశేఖర్‌లపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: తాగిన మైకంలో ఓ యువకుడిని మరో ముగ్గురు చితకబాదడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జనగామ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఈనెల 20న పట్టణంలోని కౌశిక్ వైన్స్ వద్ద పట్టణంలో బయట కమ్మరి వృత్తి చేసుకునే ముగ్గురు యువకులు బాలు, సురేశ్, మంగల్‌లు పట్టణానికి చెందిన తంబోజు సందీప్(22)తో రాత్రి 8 గంటల సమయంలో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో సందీప్‌ను విపరీతంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సూచన మేరకు ఎంజీఎం ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియాలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి సందీప్ మృతి చెందాడు. సందీప్ తండ్రి హరి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

బాలుడిపై వసతిగృహ వంట మనిషి లైంగిక దాడి



నిందితుడితో సీఐ రాజయ్య, ఎస్ఐ వంశీధర్

గార్ల, న్యూస్‌టుడే: బయ్యారంలోని గిరిజన బాలుర వసతిగృహంలో వంటమనిషిగా ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఎస్.రాము(28) అనే యువకుడు అదే వసతిగృహంలోని ఓ పన్నెండేళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసును నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ రాజయ్య తెలిపారు. స్థానిక రక్షకభట నిలయంలో బుధవారం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా బాలుడిపై లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత బాలుడి తండ్రి వీరన్న రక్షకభట నిలయంలో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం ఇల్లెందు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వంశీధర్, హెడ్‌కానిస్టేబుల్ ముల్కూరి వెంకటరెడ్డి, కానిస్టేబుల్ అనిల్ పాల్గొన్నారు.

హాయ్! బుజ్జీ!!

కొత్త రైలు బళ్లు వస్తున్నాయ్...
బుల్లెట్టుల్లా దూసుకెళ్లిపోతాయ్...
తొందరగా గమ్యాన్ని చేర్చేస్తాయ్...
వివరాలు చదివేయమంటున్నాయ్...

చుకుచుకు కాదు... రయ్ రయ్!

1 మొదటి స్థానం నాదే!

- చైనాలో ప్రపంచంలోనే వేగవంతమైన రైళ్లు త్వరలోనే పట్టాలెక్కుతున్నాయి. ఎప్పుడంటే వచ్చే సెప్టెంబరు 21 నుంచే.
- బీజింగ్ నుంచి షాంఘైల మధ్యే.
- వీటిని ఫక్సింగ్ రైళ్లని పిలిచేస్తున్నారు.
- వీటి ప్రత్యేకత ఏమంటే ఇప్పుడు ఉన్న వాటి కంటే వేగంగా గరిష్ఠంగా గంటకు 400 కిలోమీటర్లకుపైగా వేగాన్ని అందుకుంటాయి. అయితే ప్రమాదాలు జరగకుండా ఉండటానికి గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసేలా ఏర్పాట్లుచేశారు.
- 1250 కిలోమీటర్ల దూరాన్ని నాలుగున్నర గంటల్లోనే చేరతాయి. అంటే హైదరాబాద్ నుంచి కాశీకి వెళ్లినంత దూరం మరి!

2 ఇప్పటికిదే రారాజు!

- ఇప్పుడు నడుస్తున్న రైళ్లలో ఎక్కువ వేగంగా ప్రయాణించే రైలు ఏదబ్బా అంటే హార్మోనీ సీఆర్‌హెచ్ 380ఎ.
- గరిష్ఠంగా ఇది గంటకు 379 కిలోమీటర్ల వేగంతో పరిగెట్టేస్తుంది.
- విద్యుత్‌శక్తితో పనిచేసే ఇది చైనాలోని షాంఘై, నాన్‌జింగ్‌ల మధ్య తిరుగుతోంది.
- ఒకేసారి 494 మందిని మోసుకుపోగలదు.
- ఈ దేశానికే చెందిన సీఎస్ఆర్ కింగ్డో సైఫో లోకోమోటివ్ అండ్ రోలింగ్ స్టాక్ సంస్థ దీన్ని తయారు చేసింది.

3 నాదిక మూడో స్థానం!

- ఇప్పుడు పట్టాలపై పరుగులు తీస్తున్న వాటిలో రెండో వేగవంతమైన రైలు ఏజీవీ ఇటాలో.
- గరిష్ఠంగా గంటకు 359 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.
- ఇటలీలోని రోమ్, నేపల్స్ మధ్య రాకపోకలు సాగిస్తుంది.
- ఫ్రాన్స్ సంస్థ ఆల్‌స్టోమ్ దీన్ని తయారు చేసింది.
- మనకు కావలిసినట్టు మార్చుకునే సీట్లు, టీవీ, వైఫై లాంటి సౌకర్యాలూ దీనిలో ఉన్నాయి.

4 భారత్‌లో..

- మన దగ్గర ఇప్పటి వరకు బుల్లెట్ రైలే లేదు. మరి కొన్నేళ్లలో దీన్ని చూడొచ్చు. అలహాబాద్, ముంబయిల మధ్య ఈ లైను పనులు జరుగుతున్నాయి.
- అయితే ప్రస్తుతం మన దేశంలో అత్యంత వేగంగా ప్రయాణించే రైలు గతిమాన్ ఎక్స్‌ప్రెస్. ఇది సెమీ హైస్పీడ్ రైలు.
- మన రాజధాని దిల్లీ, ఆగ్రాల మధ్య తిరుగుతుందిది. అంటే 233 కిలోమీటర్ల దూరాన్ని 1:45 నిమిషాల్లో చేరుకుంటుంది.
- ఇది గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు.

మీకు తెలుసా?

- మొదటి బుల్లెట్ రైలు పుట్టింది జపాన్‌లో.
- 1930 నుంచీ దీనిపై ప్రయోగాలు మొదలయ్యాయి.
- ఇది 1964లో పట్టాలెక్కింది.

బుల్లెట్ రైలు తర్వాతేంటి?

- బుల్లెట్ రైలే వేగమనుకుంటే దాన్ని మించినది ఇంకోటి వస్తోందండోయ్. అదే హైపర్‌లూప్.
- గంటకు 700కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందిది. అంటే హైదరాబాద్ నుంచి విజయవాడకు దాదాపు 20 నిమిషాల్లోపే వెళ్లిపోవచ్చు.

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Put = పెట్టు
- కపటం = మోసం

మన లోపల శత్రువు లేనంత వరకు బయటి శత్రువు మనల్ని భయపెట్టలేదు
– గౌతమ బుద్ధుడు

చిలిపి ప్రశ్న

రోజూ వెండి గ్లాసుతో నీళ్లు తాగితే ఏమవుతుంది?
- జి. అన్నాజీరావు, పొందూరు

కవలలేరి?



నవ్వుల జల్లులు!

టీచర్: శీనూ! 'రంగస్థలం' అనే పదం ఇరవై సార్లు రాయమంటే పది సార్లే రాశావేం?
శీను: నేను లెక్కల్లో కూడా వీకే టీచర్!
- బి. రామారావు, నిజామాబాద్

కిరణ్: ఎందుకు అలా డల్‌గా ఉన్నావు?
రాము: కాలికి దెబ్బ తగిలింది హోమ్‌వర్క్ చేయలేదు...
కిరణ్: కాలికి దెబ్బ తగిలితే చేత్తో రాయడానికేం?
రాము: ఆ చేత్తోనే కదరా కాలికి మందు రాసేది!
- కె. గోవింద్, ఆముదాలవలస

సరదా పదాలు

ఇక్కడున్న తెలుగు పదాల సమానార్థకాల్ని పక్కనే ఉన్న ఆంగ్ల అక్షరం ఉచ్చారణ వచ్చేలా గడులు నింపగలరా?

1. బీజం V ☐☐
2. గెలుపు V ☐☐
3. ఖరీదు V ☐☐
4. ఆశ్చర్యం V ☐☐
5. పెళ్లి V ☐☐
6. అమ్మకం V ☐☐
7. నమ్మకం V ☐☐
8. పద్ధతి V ☐☐

- ఎం. అప్పాజీకృష్ణ, బెంగళూరు

గబగబా అనండి

పళ్లెంలో అక్షంతలు, కళ్లంలో పక్షులు

సుడోకు


			6					5
	2	5			9	6		
8					2			
4	9	6		2				
	1	7	5		4	9	6	
				6		1	4	7
			4					8
		2	8			7	9	
5					1			

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

ఎందుకు? ఏమిటి? ఎలా?

గుడ్లగూబలు మెడల్ని ఎందుకలా తిప్పుతాయి?

ప్రశ్న: గుడ్లగూబ తన మెడను అంతలా వెనక్కి ఎందుకు తిప్పుతుంది?
- ఎం. నరేష్, 9వ తరగతి, నల్గొండ



జవాబు: గుడ్లగూబలు(owls) పగటిపూట సూర్యుని వెలుతురులో సరిగా చూడలేవు. అందువల్ల అవి రాత్రివేళల్లోనే తమ ఆహారాన్ని వేటాడుతాయి. రాత్రి వేళల్లో బాగా చూడ్డానికి అవసరమయ్యే కాంతిని రాబట్టుకోవడానికి వాటికి విశాలమైన కళ్లు వాటిలో గొట్టాల రూపంలో ఉండే కనుగుడ్లు ఉంటాయి. ఈ కనుగుడ్లు గొట్టాల రూపంలో ఉండటంతో అటూ ఇటూ కదిలించడం అంత సులభం కాదు. అందువల్ల గుడ్లగూబలు తమ తలల్ని వెనక్కి తిప్పుతాయి. వాటి మెడలో అదనంగా ఉండే ఎముకలు అలా తిప్పడానికి సాయపడతాయి. ఆ విధంగా గుడ్లగూబలు తనకు ఆహారంగా ఉండే జీవులకు ఏ మాత్రం తెలియకుండా తమ స్థానాల్లో కదలకుండానే తలల్ని 270 డిగ్రీల మేర తిప్పి వాటి ఉనికిని గుర్తించి వేటాడగలవు.
- ప్రొ॥ ఈ.వి.సుబ్బారావు, హైదరాబాద్

జవాబులు:

సరదా పదాలు: 1. విత్తనం 2. విజయం 3. విలువ 4. విచిత్రం 5. వివాహం 6. విక్రయం 7. విశ్వాసం 8. విధానం

కవలలేరి: ఖ,గ

చిలిపి ప్రశ్న: దాహం తీరుతుంది!

సుడోకు:

9	3	1	6	4	8	2	7	5
7	2	5	3	1	9	6	8	4
8	6	4	7	5	2	3	1	9
4	9	6	1	2	7	8	5	3
3	1	7	5	8	4	9	6	2
2	5	8	9	6	3	1	4	7
1	7	3	4	9	6	5	2	8
6	4	2	8	3	5	7	9	1
5	8	9	2	7	1	4	3	6


ధన్వాడ ఎస్సీ వసతి గృహం

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు పదేళ్లుగా కాస్మోటిక్ ఛార్జీలు పెరగడం లేదు. ప్రస్తుతం నెలకు అందజేస్తున్న రూ. 62 ఏమూలకు సరిపోవడం లేదు. మార్కెట్‌లో పెరిగిన ధరలు, విద్యార్థి వ్యక్తిగత స్వచ్ఛత అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఛార్జీలను పెంచుతున్నట్లు రెండేళ్లుగా పాలకులు చెబుతూ వస్తున్నారు. కాని ఆచరణలో అమలు కాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.ఈక్రమంలో దుస్తులు ఉతికేందుకు సబ్బులు కొనలేని దుస్థితి , పెరిగిన జుట్టును కత్తిరించుకోలేని దైన్యం నెలకొనడంతో పాటు వ్యక్తిగత శుభ్రతకు దూరమవుతున్నారు. – న్యూస్‌టుడే, ధన్వాడ

మొత్తం వసతిగృహాలు 198

విద్యార్థులు 20,000

మాసిన దుస్తులు.. పెరిగిన జుట్టు..

పదేళ్లుగా పెరగని కాస్మొటిక్ ఛార్జీలు

వసతి గృహాల్లో కరవైన శుభ్రత

ఆందోళనలో విద్యార్థులు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 198 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఎస్సీ వసతి గృహాలు 102 ఉండగా బీసీ వసతి గృహాలు 62 ఉన్నాయి..ఎస్టీ వసతి గృహాలు 34 ఉన్నాయి. వీటన్నింటిలో 20 వేల వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను వసతి గృహాల్లో వదిలిపెట్టి ఎందరో తల్లిదండ్రులు పొట్ట కూటి కోసం వలస వెళ్లారు. దీంతో పిల్లల అవసరాలను తీర్చే వారు లేకుండా పోయారు. కనీసం పళ్ల పొడి కొనుగోలుకు కూడా చేతిలో చిల్లిగవ్వ ఉండటం లేదు. మంచి సబ్బుతో స్నానం చేయలేకపోతున్నారు. తల వెంట్రుకలు కత్తిరించుకునేందుకు రూ.12 మాత్రమే ఇస్తున్నారు. దుస్తులు ఉతుక్కోవడానికి అవసరమగు సబ్బు కోసం నెలకు రూ. 5 ఇస్తున్నారు. వీటన్నింటి కారణంగా శుభ్రతకు దూరమై గజ్జి, తామర లాంటి వ్యాధులకు గురవుతున్నారు



జుట్టు కత్తిరింపునకే సరిపోవు ..: ప్రస్తుతం నెలకు అందజేస్తున్న రూ. 62 తల వెంట్రుకల కత్తిరింపునకు కూడా సరిపోవడం లేదు. దీని వల్ల సబ్బులు, పేస్ట్, బ్రష్, పౌడర్, నూనె లాంటి వస్తువులు కొనుగోలు చేయలేకపోతున్నాం. ఫలితంగా గజ్జి, తామర, దురద లాంటి వ్యాధులు వస్తున్నాయి.. కనీసం ప్రతి నెలా రూ. 150 ఇస్తే బాగుంటుంది.

– తిరుపతి, పదో తరగతి, ఎస్సీ వసతి గృహం, దన్వాడ



సామగ్రి ప్రభుత్వమే అందజేయాలి..: కాస్మోటిక్ ఛార్జీల రూపంలో డబ్బు బదులుగా విద్యార్థికి అవసరమగు సామగ్రిని ప్రభుత్వమే అందజేయాలి. ప్రస్తుతం ఈ విధానాన్ని ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాల్లో అమలు చేస్తోంది. ఇక్కడ మూడు నెలలకో సారి వస్తువులు సరఫరా చేస్తున్నారు. ఇదే విధానాన్ని మాకు వర్తింపజేయాలి.

– రాజు , ఎస్సీ వసతి గృహం విద్యార్థి , ధన్వాడ

ప్రతిపాదనలు పంపించాం..

కాస్మోటిక్ ఛార్జిలు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.. ప్రస్తుతం ఉన్న ధరలకు ఇస్తున్న డబ్బు సరిపోవడం కష్టమే..ఛార్జీల పెంపుపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. విద్యార్థుల వివరాలు పంపించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.. వాటిని పంపించాం..

– విజయకుమార్, సాంఘిక సంక్షేమాధికారి, మహబూబ్‌నగర్

అడ్డుగా ఉన్నాడని అంతమొందించారు

మిడ్జిల్, న్యూస్‌టుడే : భూ వివాదంలో అడ్డుగా ఉన్నాడని తోడబుట్టిన అన్ననే పథకం ప్రకారం తమ్ముడు దారుణంగా హత్యచేసి తప్పించుకునేందుకు కుట్ర పన్నాడని జడ్చర్ల సీఐ రవీందర్‌రెడ్డి చెప్పారు. బుధవారం మండల కేంద్రంలోని ఠాణాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కొత్తూర్‌కు చెందిన ఆంజనేయులు హత్య జరిగిన తీరును ఆయన వివరించారు. ఈనెల 14న రాత్రి పొలానికి వెళ్లిన ఆంజనేయులు తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపడుతున్న సమయంలో గ్రామశివారులోని దుందుభి వాగులో మృతదేహం కనిపించింది. ఈ క్రమంలో దర్యాప్తు ముమ్మరం చేయగా దారుణంగా హత్య చేశారన్న సమాచారంతో విస్తృతంగా గాలించగా బుధవారం మండల పరిధిలోని రాణిపేట స్టేజీ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఆంజనేయులు తమ్ముడు శ్రీశైలంను విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయని తెలిపారు. భూ పంపకాల విషయంలో ఏడాది కాలంగా ఇద్దరి మధ్య వివాదం జరుగుతుందని.. ఇటీవల పంపకాలు జరిగినా 13 కుంటల భూమి విషయంలో ఇరువురు ఘర్షణ పడ్డారన్నారు. మృతుడు ఆంజనేయులుకు అదనంగా 13 కుంటల భూమి ఉండగా ఇవ్వాలని చెప్పినా అంగీకరించకపోవడం, బోరుబావుల వద్ద జరుగుతున్న వివాదాలు రోజురోజుకు తీవ్రస్థాయికి చేరుకోవడంతో అన్నను అంతమొందించాలని నిర్ణయించకున్నాడు. ఈ క్రమంలో హత్య చేయాలని నిర్ణయించుకోగా 14న బోనాల ఉత్సవాలు ఉండడంతో రాత్రి 10 గంటల తర్వాత పొలం వద్దకు వెళ్తున్న ఆంజనేయులును పథకం ప్రకారం బోరుబావి వద్ద మారణాయుధాలతో హత్య చేసి అనంతరం గ్రామానికి చెందిన విష్ణు, పాండు సాయంతో మృతదేహాన్ని దుందుభి వాగులో పడేశారన్నారు. దర్యాప్తులో నిందితుడు వాస్తవాలను చెప్పడంతో పాటు హత్య చేసినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండు తరలిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సై సైదులు, ఏఎస్సై జహంగీర్, సిబ్బంది రాజు, రామస్వామి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


నిందితులతో సీఐ, ఎస్సై, సిబ్బంది

15 క్వింటాళ్ల చౌక బియ్యం పట్టివేత


పాత గంజ్‌లో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు, పక్కన డ్రైవరు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : నారాయణపేట డివిజన్ కేంద్రంలోని పాత గంజ్‌లో విజిలెన్స్ అధికారులు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ బృందం ఎస్పీ విశ్వనాథ్ బృందం ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. పాత గంజ్‌లో దామరగిద్దకు చెందిన బియ్యం వ్యాపారి తన వాహనంలో రేషన బియ్యాన్ని లోడ్ చేసే సమయంలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌర సరఫరాల గోదాంకు తరలించారు. బియ్యం తరలించే వాహనాన్ని సీజ్ చేసి పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దామరగిద్ద మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నారాయణ, నర్సింహులపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ బృందం ఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం సరిహద్దు కావడంతో అక్రమంగా రేషన్ బియ్యాన్ని గుర్మిట్కల్‌కు తరలిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు రాములు, మహమూద్ పాషా, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి


శ్రీనివాసులు మృతదేహం

రేవల్లి, న్యూస్‌టుడే : విద్యుత్తు నియంత్రిక వద్ద ఫ్యూజులను వేయడానికి వెళ్లి శ్రీనివాసులు అనే రైతు విద్యుదాఘాతానికి గురై మరణించిన సంఘటన మంగళవారం రాత్రి 10 గం.ల సమయంలో రేవల్లిలో జరిగింది. సంఘటన గురించి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. వరిపైరుకు నీరు పెట్టడానికి శ్రీనివాసులు అనే రైతు శేఖర్‌రెడ్డి అనే మరో రైతుతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. మోటారు ఆన్‌చేయగా అది పనిచేయలేదు. విద్యుత్తు సరఫరా కావడం లేదని తెలుసుకొని పక్కనే ఉన్న నియంత్రిక వద్దకు వెళ్లారు. నియంత్రిక వద్ద ఫ్యూజులు పోయినట్లు గుర్తించారు. ఫ్యూజులు వేసే క్రమంలోనే శ్రీనివాసులు విద్యుదాఘాతానికి గురై కిందపడి అక్కడికక్కడే చనిపోయాడు. శేఖర్‌రెడ్డి గ్రామంలోని శ్రీనివాసులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని తెలిపారు. శ్రీనివాసులుకు భార్యతోపాటు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహానికి రేవల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కటుంబ సభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

మల్కాపూర్‌లో యువకుడు..


శ్రీశైలం మృతదేహం

కోయిలకొండ, న్యూస్‌టుడే : మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన యువకుడు తాగునీటి కోసం వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన బుధవారం చోటు చోసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన శ్రీశైలం(22) పశువులను మేపడానికి ఉదయం పొలం వద్దకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దాహం వేయడంతో నీళ్లు తాగడానికి పక్కనే ఉన్న కిష్టంపల్లి వెంకటయ్య పొలంలోని బోరు వద్దకు వెళ్లి స్టాటర్ స్విచ్ వేయడానికి ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమీపంలో గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

కొతలాబాద్ (కోయిలకొండ), న్యూస్‌టుడే : మండలంలోని కొతలాబాద్ గ్రామానికి చెందిన రైతు పాముకాటుతో మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొతలాబాద్ గ్రామానికి చెందిన రాంరెడ్డి(35) మంగళవారం రాత్రి భోజన అనంతరం పొలంలో సాగు చేస్తున్న పంట అడవి జంతువుల బారిన పడకుండా కాపలా కోసం వెళ్లి అక్కడే నిద్రపోయారు. నిద్రిస్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యారు. ఉదయం ఇంటికి వచ్చి అపస్మారక స్థితిలో పడిపోయాడు. పాముకాటుకు గురయ్యారని గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య


హర్యానాయక్ (పాతచిత్రం)

అడ్డాకుల, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం తిమ్మాయపల్లి తండాలో రైతు పాత్లావత్ హర్యానాయక్ (50) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన హర్యానాయక్ తనకున్న మూడు ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంటలకు చేసిన అప్పులతో పాటు గతంలో చేసిన అప్పులు ఎక్కువ కావటంతో మనస్థాపానికి గురయ్యాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. ఆలస్యంగా గమనించిన కుంటుంబ సభ్యులు అడ్డాకుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. హర్యానాయక్‌కు భార్య, ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు.

ఉరేసుకొని యువకుడు..


గోపికృష్ణ మృతదేహం

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే : ఉరేసుకొని యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పట్టణ ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వేణుకాలనీకి చెందిన మహేష్, ప్రణితలకు ఇద్దరు సంతానం. మొదటి కుమారుడైన గోపికృష్ణ(22) బీఎస్సీ అగ్రికల్చర్ మూడోసంవత్సరం బెంగళూరులో చదువుతున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యులు మంగళవారం రాత్రి చదువుకోమని మందలించగా మనస్థాపానికి గురై బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరులేని సమయంలో పంకాకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

Junior Inter
STUDY PLAN
CHEMISTRY

A top ranker says that clear cut strategy, clarity of concepts, memorising the formulae and focussed preparation are essential for grand success. Systematic planning helps to get good score in competitive exams. By doing so one can reach the goal easily.

ప్రతిభ

The 'brain of chemistry' is..

Read Chemistry regularly early in the morning in order to retain chemistry for ever. Identify most repeated VSAQs (2 Marks), SAQs (4 Marks), LAQs (8 Marks) from previous I.P.E. papers. It is comfortable to answer in LAQs, SAQs and VSAQs order for 100% score in B.I.E. Most of the times some of the VSAQs are not repeated from few lessons, so one must learn all VSAQs given at chapter end, intext, inbox and solved questions.

For Very Short Answer Questions

(SAQs - 2 Marks)

Put more efforts on States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium & Acids-bases, Alkali & Alkaline earth metals, Group 13 & 14 elements, Environmental Chemistry and Organic Chemistry.

For Short Answer Questions

(SAQs - 4 Marks)

Learn questions from States of matter, Stoichiometry, Thermodynamics, Chemical equilibrium and Acids - Bases, H_2 & Its compounds, 13th & 14th groups, Chemical bonding and Organic Chemistry.

For Long Answer Questions

(LAQs - 8 Marks)

3 LAQs are coming only from Atomic Structure, Classification of elements, Chemical bonding and Organic Chemistry.

Atomic Structure

(8 Marks)

★ **For I.P.E.:** LAQs 1) 4 Quantum numbers 2) Postulates, limitations of Bohr's model of H atom, line spectrum of H atom.

★ **For competitive exams:** Rydberg's equation, work function, K.E., P.E., T.E., de Broglie, Heisenberg's uncertainty principle related problems and concepts. Quantum numbers, shapes of orbitals, quantum mechanical model, radial nodes and angular nodes.

Classification of Elements And Periodicity in Properties

(8 Marks)

★ **For I.P.E:** LAQs 1) $I.E._1$ & $I.E_2$, Comparison, Factors effecting 2) s, p, d, f block elements 3) Periodic property def. & their variation in group & period- I.E, E.N., E.G.E., atomic radius, nature of oxides.

★ **For competitive exams:** Criss - Cross rule, position of elements, valency, types of radii, iso electronic and all the periodic properties (exceptions trends in groups, periods and both).

Chemical Bonding And Molecular Structure

(4 + 4 or 8 Marks)

We can consider this lesson as back bone of entire chemistry. Clarity of each & every concept is very important for all types of exams.

★ **For I.P.E:** LAQs 1) Hybridisation (def. & sp, sp^2, sp^3 types) 2) MOED of O_2 & N_2– their bond order & magnetic nature.

SAQs: 1) Hybridisation of PCl_5 & SF_6
2) Hydrogen bond, types
3) Dipole moment def., applications
4) Dative bond def., examples



5) Postulates of VSEPR theory.

★ **For competitive exams:** Complete MOT, VSEPR Theory, formal charge, hybridisation, Hydrogen bond, Fajan's rules, dipole moment, no. of lone pairs - bond pairs and bond parameters.

States of Matter : Gases and Liquids

(2 + 4 Marks)

★ **For I.P.E.:** SAQs: 1) Postulates of Kinetic molecular theory of gases 2) Deduction of gas laws: Avogadro, Boyle, Charle's, Dalton, K.E, Graham's law 3) Derivation of ideal gas equation 4) Graham's law (def. & problem) 5) Dalton's law (def. & problem) 6) 3 types of speeds (def. & problem) and solved problems 4.4 to 4.6.

★ **VSAQs:** 4, 10, 15, 18, 19, 22, 32 to 35, 42, 43, 45 and 4.7 to 4.10

★ **For competitive exams:** Vander Waal's equation, K.E., problems on 3 types of speeds, Graham's Law, Dalton's law and concepts of viscosity, Surface tension.

Stoichiometry

(2 + 4 Marks)

Stoichiometry is heart of chemistry. Art of learning physical chemistry lessons and some of the Inorganic chemistry lessons are well linked with this lesson.

★ **For I.P.E:** SAQs: 1) Balancing of redox reactions in acid medium & basic medium 2) E.F. & M.F. related problems.

★ **VSAQs:** 1, 3, 5 to 8, problems on w-w, w-v, v-v and equivalent weights solved problems: 5.1, 5.2, 5.4, 5.6 to 5.9, 5.14 law of definite proportions, law of multiple proportions.

★ **For competitive exams:** Significant figures, accuracy, precise, oxidation numbers, M, N, m, x, Eq. Wts, E.F., M.F., oxidising and reducing agents, mole concept, stoichiometric calculations.

Thermodynamics

(4 or 2 + 2 marks)

★ **For I.P.E.:** SAQs: 1) Hess's law 2) $C_p - C_v = R$ 3) Problems on types of Enthalpies.

★ **VSAQs:** 2, 14, 22, 25, 29, 32, 37 and intext questions 6.3, 6.4, 6.11, 6.12

★ **For competitive exams:** State function, path function, 1st, 2nd, 3rd laws of thermodynamics, entropy, enthalpy of formation, combustion, H, E, G related problems, criteria of spontaneity (ΔG, ΔH, ΔS linked), extensive and intensive properties.

Chemical Equilibrium & Acids - Bases

(2 + 4 Marks)

★ **For I.P.E:** SAQs: 1) Lechatlier's principle (def. & synthesis of SO_3 & NH_3) 2) K_c, K_p relation for SO_3, NH_3 equilibria 3) Lewis theory 4) Buffer solutions (def, types, examples, buffer action, problems) 5) Salt Hydrolysis def. & nature of 3 types of salt solutions 6) Solubility - Solubility product - common ion effect and intext questions 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **VSAQs:** 1, 4, 5, 7, 11, 12, 13, 24, 26, 30, 31, 69. Intext Questions: 7.2, 7.5, 7.7, 7.11, 7.14, 7.15, 7.17, 7.25 to 7.28.

★ **For competitive exams:** Q_C & K_C, K_C & K_P relation, problems on pH, K_w, K_a, K_b, K_c, Ksp, buffer solutions and salt hydrolysis of different salts.

Hydrogen & Its Compounds

(4 Marks)

★ **For IPE:** SAQs: 1) Utility of H_2 as fuel 2) Temporary & Permanent hardness of water calgon (or ion exchange method). 3) All types of hydrides 4) Oxidising and reducing properties of H_2O_2. 5) Preparation of H_2O_2 by auto oxidation method & electrolytic method.

★ **VSAQs:** There is a possibility of asking two 2 marks questions like What is syn gas/ Coal gasification/ Auto protolysis/ Uses of D_2O/ M.P., B.P. of D_2O/ 3 isotopes of H/ Use of H_2 in welding of high melting metals/ Water is amphoteric in Bronsted sense/ Why B.P. of H_2O is greater than H_2S?

★ Chapter end questions: 1, 2, 4, 5, 9, 10, 11, 15, 16, 19, 33.

★ **For competitive Exams:** Types of hydrides, problems on H_2O_2 & Hardness of water. Comparison of physical properties of H_2 & D_2, H_2O & D_2O, Calgon & ion exchange methods.

Alkali & Alkaline Earth Metals

(2 + 2 Marks)

★ **For IPE:** VSAQs: Biological importance of Ca^{+2}, Mg^{+2}, Na^+, K^+, Lesson end questions: 3, 4, 5, 6, 11, 12, 14 to 28, 33, 34, 36, 37, 42, 43. Why is KO_2 is paramagnetic? What is the Oxi. state of K in KO_2?

★ **For competitive exams:** Order of hydrated ions size, order of density, SRPs, reducing strength, solubility, lattice enthalpies of IA metals, Na-K pump, IA, IIA metal solutions in NH_3 (liq.), Uses of Cu-Be, Mg-Al alloys, Mg CO_3. It is advisable to make notes of key points & trends of periodic properties (especially anamalous properties) of 1st to 18th groups.

Group -13 Elements

(2 + 2 or 4 Marks)

★ **For I.P.E.:** SAQs: 1) Borax bead test 2) Structure of Diborane 3) Preparation & Chemical Properties of B_2H_6.

★ **VSAQs:** 1) Formula of borazine & Its common name. 2) Inert pair effect def. Stability of Tl^{+1} Salts. 3) Hybridisation of B in Borazine & Diaborane.
4. Structure of Borazole & Orthoboric acid.

★ **For competitive exams:** Physical properties, Inert pair effect, structural aspects of diborane, borax, boric acid, chemical properties of diborane, borax bead test, in text, inbox questions.



Writer:
A.N.S. Sankara Rao
Subject Expert

Group - 14 Elements

(2 + 2 or 4 Marks)

★ **For I.P.E:** SAQs: 1) Difference in properties of diamond and graphite 2) Write a short note on allotropy, catenation, inert pair effect, green house effect.

★ **VSAQs:** 1 to 31, 34d, 41, 42, 43c, 44, 45a, b, 48, 50 a, b, c, uses of Zeolites, silicones, what are fullerenes? CCl_4 doesn't dissolve in water but $SiCl_4$ dissolves. Why?

★ **For competitive exams:** Inert pair effect, uses & structures of Silicates, Silicones, Zeolites, pH of $H_2CO_3/H_2CO_3^-$ system, structure of fullerene, Types of Oxides, hydrolysis of compounds.

Environmental Chemistry

(2 + 2 Marks)

★ **For I.P.E.:** VSAQs: Sink, receptor, BOD, COD, pollutant, contaminant, TLV, Eutrophication, BOD values of clean and polluted water, DO (def. values of cold water & air), green house effect, acid rains (def., gases, causes, ill effects), chapter end questions 23, 29, 1, 2, 6, 15, 17.

★ For competitive exams: All key points.

Organic Chemistry

(2 + 4 + 4 or 2 + 8 = 10 Marks)

Organic chemistry is the 'brain of chemistry' as it is well connected to fundamentals of other lessons like chemical bonding. Highest weightage is given to this lesson. Once the logic of this lesson is known, one can score good marks in all types of exams. It is very essential to learn all the basics, concepts & their applications to score good marks in EAMCET, NEET, BITSAT, JEE Mains & Advanced like exams.

★ **For I.P.E.:** LAQs: 2 preparations & all chemical properties of C_2H_2, C_2H_4, C_6H_6

★ **SAQs:** 11 to 17, 32, 37, 39, 42, 43, 49, 57 and 59.

★ **VSAQs:** Isomers of C_3H_6O, What is polymerization? IUPAC Nomenclature (names & structures), chapter end questions: 1 to 8, 27 and solved problems 13.1 to 13.12, 13.19, 13.20 to 13.25, 13.30, 13.34, 13.36, 13.38.

★ **For competitive exams:** Identification of prefix, root word, primary & secondary suffix in organic compounds make IUPAC nomenclature easier. All named reactions, qualitative & quantitative analysis calculations, reactions, types of isomerism, conformers of ethane, electron displacement reactions, directional influence of functional groups in monosubstituted benzene, reaction mechanisms, conversions, bond parameters several revisions are required to retain Organic chemistry in mind.

జనరల్ స్టడీస్

ఎకానమీ

ప్రతిభ

భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో అతిపెద్ద పరోక్ష పన్ను సంస్కరణగా ఆవిర్భవించిన వస్తు-సేవల పన్ను (జీఎస్టీ) 2017 జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. దేశ మార్కెట్లను ఏకీకృతం చేసేలా ఒకే పన్ను విధానం రావడం వల్ల వస్తువులు ఎక్కడైనా ఒకే ధరకు లభించడమే కాకుండా, దాదాపు 17 పరోక్ష పన్నులు ఇప్పుడు ఒకే పన్నుగా అవతరించాయి. 'గుడ్ అండ్ సింపుల్ టాక్స్'గా ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని అభివర్ణించారు.

జీఎస్టీ పరిణామక్రమం

జీఎస్టీ ఆలోచన 1986-87 లోనే మన దేశంలో మొగ్గ తొడిగింది. గత పదిహేడేళ్లలో సుదీర్ఘ కసరత్తు జరిగి 2017 లో అమల్లోకి వచ్చింది. 2000 లో నాటి ఎన్డీయే సర్కారు హయంలో ఏర్పాటుచేసిన ఆర్థిక సలహా కమిటీ సూచనల మేరకు అసిమ్‌దాస్ గుప్తా నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పన్ను సంస్కరణలను వేగవంతం చేసే లక్ష్యంతో 2003 లో విజయ్ కేల్కర్ నేతృత్వంలోని కమిటీ 12 వ ఆర్థిక సంఘం సూచించినట్లుగానే జీఎస్టీని తీసుకురావాలని 2005 లో సిఫారసు చేసింది. జీఎస్టీని 2010 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తామని నాటి యూపీఏ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. ఆ తర్వాత 2011 లో యూపీఏ ప్రభుత్వం లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టింది. జీఎస్టీ కమిటీ ఛైర్మన్ పదవి నుంచి అసిమ్‌దాస్ గుప్తా తప్పుకోవడంతో కె.ఎం. మణికి ఆ బాధ్యతలు అప్పగించారు. ఇలా చాలారోజులు ఈ బిల్లు రాజకీయాల మధ్య నలిగిపోయింది. చివరికి 2015 లో లోక్‌సభలో, 2016 లో రాజ్యసభలో ఆమోదం పొంది 2017 జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 160 కి పైగా దేశాల్లో అమల్లో వున్న జీఎస్టీని 1954 లో ఫ్రాన్స్ తొలిసారిగా అమల్లోకి తీసుకొచ్చింది. మన దేశంలో జీఎస్టీ మండలి 18 సార్లు సమావేశమైంది.

జీఎస్టీ అంటే...

పన్నెండేళ్ల కిందట అమల్లోకి వచ్చిన వ్యాట్ (VAT) లో ఎన్నో లోపాలు, లొసుగులు ఉండటం, వివిధ రాష్ట్రాల్లో, వివిధ రకాల పన్నులు, పన్ను రేట్లు ఉండటంతో ఒక సమగ్ర పన్ను విధానాన్ని రూపొందించాల్సి వచ్చింది. సేల్స్‌టాక్స్, సర్వీస్‌టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ, ఎంట్రీ టాక్స్, పర్చేజ్ టాక్స్ అనే రకరకాల పన్నుల స్థానంలో 'ఒకే పన్ను'గా అమల్లోకి వచ్చిందే జీఎస్టీ. దీనివల్ల దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలవుతుంది. దేశంలో ఇప్పుడు ప్రతి వస్తువుకీ ఎక్కడైనా ఒకే శ్లాబులో పన్ను పడుతుంది. అయితే వివిధ రకాల వస్తువులు, సేవల వర్గీకరణను బట్టి వాటిపై విధించే పన్నుల శ్లాబులు దేశమంతా 0, 5, 12, 18, 28 శాతాలుగా విధిస్తారు. జీఎస్టీ పూర్తి స్వరూపాన్ని తెలుసుకుంటే అది మంచో చెడో, లాభమో, నష్టమో మనం అర్థం చేసుకోవచ్చు.

జీఎస్టీ ప్రభావం... అంచనా

సాధారణ పౌరుడి మీద ఈ కొత్త పన్ను ప్రభావం ఎలా ఉండబోతోంది? అసలు సామాన్యుడికి అంతిమంగా ఒరిగేదేంటన్న ప్రశ్న చిక్కుముడిలాగే మిగిలిపోయినా వినియోగదారుడే రాజు అనే జీఎస్టీ మౌలిక స్ఫూర్తి సాకారం కావడానికి, దాని ప్రతిఫలాలు పొందడానికి కొంతకాలం వేచిచూడక తప్పదు. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ మండలి మున్ముందు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సామాన్యులు రోజువారీ ఉపయోగించే వస్తువుల్లో 81% సున్నా నుంచి 18% లోపు పన్ను పరిధిలోకి వచ్చాయి. తద్వారా సంస్థలు పన్ను ప్రయోజనాలను వినియోగదారులకు అందిస్తున్నాయో లేదో చూడటానికి 'యాంటీ ప్రాఫిటీరింగ్' కమిటీ పనిచేస్తుంది. ఈ కమిటీకి ధరలు తగ్గించని సంస్థల లైసెన్స్‌ను రద్దు చేసే హక్కు ఉంటుంది.

అలాగే సంస్థలకు 'ఇన్‌పుట్ క్రెడిట్' వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. వ్యాట్‌లో వివిధ దశల్లో విధించే పన్ను స్థానంలో జీఎస్టీ రావడం వల్ల ఒకే పన్ను విధానం అమలవుతోంది. దీంతో లభించే ఇన్‌పుట్ క్రెడిట్ పన్ను చెల్లింపులను ప్రోత్సహిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యాపారి దగ్గర 1000 రూపాయలకి ఒక వస్తువును కొని, దాన్ని 1500 కి తిరిగి అమ్మితే, రెండో వ్యాపారి పై 500 రూపాయలకు పన్నుకడితే సరిపోతుంది. మొదటి 1000 రూపాయలకు మొదటి వ్యాపారే పన్నుకట్టాడు కాబట్టి, రెండో వ్యాపారికి ఇన్‌పుట్ క్రెడిట్ లభ్యమవుతుంది. ఇది సంస్థలకు పన్ను భారాన్ని తగ్గిస్తుంది.

అలాగే ఒక వస్తువు ఏ ప్రాంతంలో తయారైనా, అది చివరిగా ఏ ప్రాంతంలో వినియోగమవుతుందో, ఆ ప్రాంత రాష్ట్రానికే దాని తాలూకు పన్ను దక్కుతుంది. తత్ఫలితంగా ఎక్కువ కొనుగోలు శక్తి ఉన్న రాష్ట్రాలకు పన్నుల ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. అలాగే గతంలో వేర్వేరు రాష్ట్రాల మధ్య సరకు రవాణా పన్నులు ఎక్కువగా ఉండటంతో చిన్న రాష్ట్రాలు వెనకడుగు వేసేవి. ఇప్పుడు వెనకబడిన రాష్ట్రాలు తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా రవాణా చేయగలుగుతాయి. దేశంలో ఎగువ మధ్యతరగతి ప్రజలు, సంపన్నులపైనా, చిన్న వ్యాపారులపైనా, ప్రముఖ బహుళజాతి సంస్థలపైనా జీఎస్టీ భారంగానే ఉందనవచ్చు. ఎంట్రీటాక్స్ రద్దుతో చెక్‌పోస్టుల్లో అవినీతికి అడ్డుకట్ట పడుతుందని చెప్పవచ్చు. ప్రతి వ్యాపారి, సంస్థ పన్ను రిటర్నుల నిర్వహణంతా పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేయాలనే నిబంధన ఉండటంతో దీనిలో నమోదు చేసుకున్న ఏ వ్యాపారీ పన్నుల నుంచి తప్పించుకోలేడు. కాబట్టి వ్యవస్థలో నల్ల ధనం ఎంతో కొంత తగ్గే అవకాశం ఉంది. అలాగే పన్ను చెల్లింపుదార్లకు జీఎస్టీ బిల్లు రాయితీలు, ప్రయోజనాలు కల్పిస్తుండటంతో సంస్థలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు సన్నద్ధత వ్యక్తం చేస్తాయి. జీఎస్టీ పరిధిలోకి వచ్చే ప్రతి వ్యాపారికీ జీఎస్టీ కంప్లయిన్స్ రేటింగ్ లభిస్తుంది. సంస్థలు ఈ రేటింగ్ పెంచుకునే క్రమంలో సమర్థంగా పనిచేస్తాయి. మన జీడీపీలో పన్నుల వాటా పెరుగుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే ప్రస్తుత మన జీఎస్టీ రేట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ రాబోయే కాలంలో పన్నుల ఆదాయం, పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం వల్ల పన్నురేట్లు తగ్గే అవకాశం ఉంది. ఈ చారిత్రాత్మక పన్ను వల్ల సామాన్యులు కొన్ని లాభాలను అందుకోవడమే కాదు, కొన్ని త్యాగాలకు సిద్ధపడకా తప్పదు. కొన్ని వస్తువులపై పన్ను భారం తగ్గినట్లు కనిపించినా సేవా పన్నుల రూపంలో తిరిగి రాబట్టుకోవడం జీఎస్టీ ప్రత్యేకత.

జీఎస్టీని మొదట అమల్లోకి తెచ్చిన దేశం?



రచయిత
- దాడి నారాయణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్

జీఎస్టీ స్వరూపం - అమలు

వస్తువు తయారీ నుంచి వినియోగదారుడికి చేరేవరకూ వివిధ దశల్లో అదనపు విలువపై పన్నుభారం పడటం జీఎస్టీ ప్రత్యేకత. సరఫరాదారుడు లేదా వినియోగదారుడు ఉన్న ప్రదేశంలో పన్ను వసూలుచేసే 'గమ్యం ఆధారిత' పన్ను దీనిలో భాగం. జీఎస్టీ మండలి సిఫారసు మేరకు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు జీఎస్టీ రేట్లను ప్రకటిస్తాయి. అంటే ఒక వస్తువు లేదా సేవపై పన్ను తగ్గించాలన్నా పెంచాలన్నా అది జీఎస్టీ కౌన్సిల్‌కే సాధ్యం. ఈ మండలిలో కేంద్ర ఆర్థికమంత్రి ఛైర్మన్‌గా, రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉంటారు. 0, 5, 12, 18, 28 శాతం పన్నురేట్లతో పాటు, బంగారం, బంగారు ఆభరణాలపై 3% ప్రత్యేక జీఎస్టీని ప్రతిపాదించారు. కొన్ని వస్తువులపై ప్రత్యేక సెస్సులు విధించి ఇలా వసూలైన ఆదాయాన్ని జీఎస్టీ అమలుతో ఆదాయాన్ని కోల్పోతున్న రాష్ట్రాలకు నష్టాన్ని భర్తీ చేయటానికి కేటాయిస్తారు. ద్వంద్వ జీఎస్టీ విధానాన్ని, సమీకృత జీఎస్టీ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సదుపాయంతో పన్నుపై పన్ను లేకపోవడం వల్ల పన్నుల పరిధి విస్తృతమై, ధరలు తగ్గి, పన్ను ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. జీఎస్టీతో రాష్ట్రాల పన్ను రాబడి తగ్గితే, దాన్ని వచ్చే అయిదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తుంది. జీఎస్టీ అమలుకు 'జీఎస్టీ నెట్‌వర్క్' (GSTN) పేరుతో లాభాపేక్షలేని ఒక సంస్థను ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి - వ్యాపారులకు మధ్య, కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జీఎస్టీ అమలు విషయంలో ఏదైనా వివాదం తలెత్తితే దాని పరిష్కారానికి జీఎస్టీ కౌన్సిల్ ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది.

రూ. 20 లక్షల కంటే అధిక వార్షిక వ్యాపారాదాయం ఉన్నవారంతా జీఎస్టీ పరిధిలోకి వస్తారు. దిగుమతులను అంతర్రాష్ట్ర లావాదేవీగా పరిగణించి IGST విధిస్తారు. ఎగుమతుల మీద జీఎస్టీ ఉండదు. సెక్యూరిటీ లావాదేవీలకు, SEZ యూనిట్లకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే మద్యం, పెట్రోలియం ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న పన్నులనే విధిస్తారు. వీటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకురాలేదు. వీటిని ఎప్పుడు తీసుకురావాలనే అంశంపై జీఎస్టీ కౌన్సిల్ భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటుంది.

మీ అభిప్రాయాలు పంపాల్సిన మెయిల్ ఐడీ
pratibhadesk@eenadu.net

రద్దయ్యే కేంద్ర పన్నులు..
కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ (CVD) ప్రత్యేక అదనపు కస్టమ్స్ డ్యూటీ, సేవాపన్ను.

రద్దయ్యే రాష్ట్ర పన్నులు..
రాష్ట్ర వ్యాట్ (VAT), కేంద్ర అమ్మకం పన్ను, విలాస సుంకం, ప్రవేశ పన్ను, వినోద పన్ను (స్థానిక సంస్థలు విధించేవి మినహా) ప్రకటనలపై పన్ను, కొనుగోలు పన్ను, లాటరీలు, పందెం, జూదంపై పన్ను.

జీఎస్టీపై అపోహలు - వివిధ రంగాలపై ప్రభావం

దేశంలో అన్ని రంగాల పురోగమనమే ధ్యేయంగా దూసుకొచ్చిన జీఎస్టీ సమాఖ్య స్ఫూర్తికి చక్కటి ఉదాహరణ. వివిధ రాష్ట్రాల మధ్య ఆరోగ్యకర పోటీకి ఆస్కారమిస్తుంది. అయితే ఏదైనా కొత్త సంస్కరణ అమల్లోకి వచ్చినప్పుడు కొన్ని రంగాలపై సానుకూల, మరికొన్నింటిపై ప్రతికూల ప్రభావం చూపించవచ్చు. మరికొన్నింటిపై ఏ విధమైన ప్రభావం ఉండకపోవచ్చు. అయితే జీఎస్టీ అమల్లో ప్రభుత్వ కృషితో పాటు పన్ను చెల్లింపుదార్లు, వ్యాపారుల సహకారం ముఖ్యం. దాదాపు 130 కోట్ల మంది జనాభా, 2.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశాన్ని ఏకీకృతంగా రూపుదిద్దడం సామాన్యమైన విషయం కాదు. స్వాతంత్ర్యానంతరం అమల్లోకి వచ్చిన అతిపెద్ద పరోక్ష పన్నుల సంస్కరణగా దీన్ని ప్రశంసిస్తున్నారు. అయితే జీఎస్టీ వల్ల ధరలు పెరుగుతాయనేది అపోహ మాత్రమే. నిత్యావసరాలు, ఆహార పదార్థాలపై పూర్తిగా పన్ను తొలగించారు. రాష్ట్రాలకు ఆదాయం తగ్గినా 2015-16 ఆర్థిక సంవత్సరంలో ప్రామాణికంగా వచ్చిన రాబడికి 14% అదనంగా ఇస్తారు. ఏటా ఇలా లెక్కించి లోటును భర్తీచేస్తారు. వ్యాపారులకు ఆన్‌లైన్‌లో నమోదు వల్ల పన్ను విధానం మరింత సరళీకృతమవుతుంది. రాష్ట్రాలకు పన్నుల ద్వారా వచ్చే రాబడిలో జీఎస్టీ పరిధిలోకి వచ్చేది 38 శాతం వరకు మాత్రమే ఉంటుంది. కొత్త వ్యవస్థలోకి మారడానికి కంపెనీలు ఏకకాల భారీ వ్యయాలను మోయాల్సి ఉన్నా దీర్ఘకాలంలో లాభాలే పొందుతాయి. రవాణా కంపెనీలకు అత్యధిక ప్రయోజనం ఉంటుంది. రాష్ట్రాలకు సేవా పన్నుల నుంచి అదనపు రాబడి వస్తుంది.

జీఎస్టీ వల్ల ఎఫ్ఎంసీజీ (FMCG) దీర్ఘకాలంలో ప్రయోజనం కలిగి సరఫరా మెరుగుపడి, 81 శాతం ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. అయితే బ్యాంకింగ్, బీమా, టెలికాం సేవలు మరింత ప్రియం కానున్నాయి. ఆభరణాల ధరలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. వాహన రంగంలో విలాసవంతమైన కార్లపై పన్నుభారం తగ్గే అవకాశం ఉంది. అయితే జీఎస్టీ మండలి దీనిపై సమీక్ష జరిపితే, భవిష్యత్తులో వాహన రంగ ధరల్లో స్వల్పహెచ్చు తగ్గులు సంభవించవచ్చు. ఎలక్ట్రానిక్స్ రంగంపై జీఎస్టీ ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. బొగ్గుపై పన్నురేటు తగ్గడంతో సిమెంట్‌పై జీఎస్టీ ప్రభావం స్వల్పంగానే ఉంది. ఇనుము, ఉక్కు రంగాలకు కొంత సానుకూలత ఉంది.

ఇటీవల జీఎస్టీ మండలి సమావేశంలో అదనంగా 66 రకాల వస్తువులపై పన్నుపోటును జీఎస్టీ మండలి ఉపసంహరించింది. అలాగే జీఎస్టీ రాక ముందు వివిధ రాష్ట్రాలు చేపట్టిన వివిధ అభివృద్ధి, ఉత్పాదక ప్రాజెక్టులపై ఈ రేట్ల ప్రభావాన్ని జీఎస్టీ మండలి సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఆయా ప్రాజెక్టులను అప్పటి పన్నురేట్లకు అనుగుణంగా చేపట్టారు. అలాగే సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన ఇ-వే బిల్లుల విధానానికి తాజాగా ఇటీవల దిల్లీ జీఎస్టీ సదస్సులో మార్గం సుగమం చేశారు. ముందు దూరంగా ఉండిపోయిన జమ్మూ-కశ్మీర్‌ను ఈ పన్ను పరిధిలోకి తేగలిగారు.

12 వందలకు పైగా వస్తువులు, అయిదువందల రకాల సేవలకు ఇతమిద్ధంగా పన్నురేట్లు ఖరారైనా శ్లాబులో వర్గీంపజేయడంలో నెలకొన్న గందరగోళాన్ని రానున్న కొద్ది నెలల్లో పరిష్కరించాలి. గతంలో సుబ్రహ్మణ్యన్ కమిటీ అన్ని రకాల వస్తువులు, సేవలపై ఏకరూప పన్ను 15 - 15.5% ఉండాలని ప్రతిపాదించింది.

పన్నురేట్లు హేతుబద్ధ స్థాయిలో ఉంటే, చెల్లింపులు స్వచ్ఛందంగా, నిజాయతీగా జరుగుతాయని 'ఆడంస్మిత్' ఏనాడో పేర్కొన్నారు. శ్లాబుల సంఖ్యను కనిష్ఠ స్థాయికి కుదించి, పన్నురేట్లను సహేతుకంగా స్థిరీకరించే దీర్ఘకాలిక లక్ష్యంతో ముందడుగు వేస్తే జీఎస్టీ ధ్యేయం నేరవేరినట్లే.

మాదిరి ప్రశ్నలు

1. వస్తు, సేవల పన్ను ఎప్పటినుంచి అమల్లోకి వచ్చింది?
1) 2017 జనవరి 1 2) 2017 మార్చి 1
3) 2017 ఏప్రిల్ 1 4) 2017 జులై 1

2. జీఎస్టీని 'గుడ్ అండ్ సింపుల్ టాక్స్'గా ఎవరు అభివర్ణించారు?
1) నరేంద్ర మోదీ 2) అరుణ్ జైట్లీ
3) ప్రణబ్ ముఖర్జీ 4) ఎం. వెంకయ్యనాయుడు

3. జీఎస్టీ మండలి (GST Council) కి నేతృత్వం వహించేదెవరు?
1) రాష్ట్రపతి 2) ప్రధానమంత్రి
3) కేంద్ర ఆర్థికమంత్రి 4) కేంద్ర పరిశ్రమల మంత్రి

4. జీఎస్టీని 1954 లో మొదటిసారిగా అమల్లోకి తెచ్చిన దేశం ఏది?
1) ఇంగ్లండ్ 2) ఫ్రాన్స్ 3) జర్మనీ 4) ఇటలీ

5. జీఎస్టీలో విధించే వివిధ రకాల పన్ను శ్లాబుల శాతం ఎంత?
1) 4, 11, 17, 27 2) 5, 12, 18, 28
3) 6, 13, 19, 29 4) 7, 14, 20, 30

6. ప్రస్తుతం మన దేశ జీడీపీ (GDP) లో పన్నుల వాటా ఎంత?
1) 14% 2) 15% 3) 16% 4) 17%

7. జీఎస్టీఎన్ (GSTN) మొదటి ఛైర్మన్ ఎవరు?
1) నవీన్ కుమార్ 2) ప్రకాష్ కుమార్
3) నితిన్ మిశ్రా 4) రాజీవ్ కుమార్

8. జీఎస్టీలో భాగంగా దేశంలో విధించే పన్ను రూపాలు ఏవి?
1) CGST 2) SGST 3) IGST 4) పైవన్నీ

9. జీఎస్టీల పరిధిలోకి వచ్చే వార్షిక వ్యాపారాదాయ పరిమితి ఎంత?
1) రూ. 10 లక్షలు 2) రూ. 15 లక్షలు
3) రూ. 20 లక్షలు 4) రూ. 25 లక్షలు

10. జీఎస్టీ కోసం రాజ్యాంగంలో సవరించిన ఆర్టికల్ ఏది?
1) 278 ఎ (1) 2) 299 ఎ (1)
3) 279 ఎ (1) 4) 280 ఎ (1)

11. జీఎస్టీ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రథమంగా రాటిఫై (Ratify) చేసిన రాష్ట్రం ఏది?
1) హరియాణా 2) అసోం
3) గుజరాత్ 4) పంజాబ్

12. 1 జులై 2017 న ఏ రాష్ట్రంలో జీఎస్టీ అమలు ప్రారంభం కాలేదు?
1) పశ్చిమ్ బంగ 2) ఒడిశా
3) జమ్మూ - కశ్మీర్ 4) పైవేవీకావు

జవాబులు

1-4	4-2	7-1	10-3
2-1	5-2	8-4	11-2
3-3	6-3	9-3	12-3

ఆక్వాఫోనిక్స్ విధానాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలి



చేపల చెరువులను పరిశీలిస్తున్న హరీశ్వర్‌రెడ్డి, వెంకటపతి రెడియార్

బాలానగర్, న్యూస్‌టుడే : ఆధునిక వ్యవసాయ విధానంలో భాగంగా ఆక్వాఫోనిక్స్ విధానం ద్వారా తక్కువ విస్తీర్ణం, తక్కువ నీటి వినియోగంతో చేపల పెంపకం ప్రక్రియను దేశవ్యాప్తంగా విస్తరింపజేయాలని.. ఈ విధానాన్ని ప్రతి రైతుకూ పరిచయం చేయాలని వ్యవసాయశాఖలో కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మశ్రీ అవార్డును అందుకున్న పాండిచ్చేరికి చెందిన రైతు వెంకటపతి రెడియార్ అన్నారు. మండల పరిధిలోని గుండేడు శివారులోని రైతు విశ్వనాథరాజు వ్యవసాయ క్షేత్రాన్ని వెంకటపతి రెడియార్, పరిగి మాజీ శాసనసభ్యుడు హరీశ్వర్ రెడ్డి, పుదుచ్చేరికి చెందిన ఉద్యానవనశాఖ ఏడీ జయశంకర్ తదితరులు బుధవారం సందర్శించారు. తక్కువ విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన చేపల చెరువులను వారు పరిశీలించారు. చేపల వ్యర్థాలతో కూడిన నీటితో ఆకుకూరలు, కూరగాయల తోటలను సాగుచేస్తున్న విధానాన్ని రైతు విశ్వనాథరాజు వారికి వివరించారు. దీంతో సాగు వ్యయం తగ్గడంతో పాటు నాణ్యమైన, పౌష్టికరమైన దిగుబడులను సాధిస్తున్నట్లు తెలిపారు. వెంకటపతి రెడియార్ మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులను అధికంగా వాడటంతో పొలాల్లో చీడపురుగులకు బదులుగా రైతులు మృత్యువాత పడుతున్నారన్నారు. అంటుకట్టే విధానం ద్వారా పాండిచ్చేరిలో 300 రకాల కనకాంబరం పూల మొక్కలను, మూడేళ్లపాటు దిగుబడులిచ్చే వంగ, టమాట, మిరప తోటలను సాగుచేసినట్లు తెలిపారు. మాజీ శాసనసభ్యుడు హరీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయంలో అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను తీసుకురావాలని, వ్యవసాయ విధానాల్లోనూ గణనీయమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విశ్వనాథరాజు వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న ఆధునిక వ్యవసాయ విధానాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. పుదుచ్చేరిలోనూ ఈ తరహా వ్యవసాయ విధానాలను అవలంబిస్తామని ఉద్యానవనశాఖ ఏడీ జయశంకర్ అన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన:** వినాయకచవితి సందర్భంగా రేపటి స్పెషల్ ఆరాధనలో కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయ విశేషాలు; శ్రీ సామవేదం ప్రత్యేక ప్రవచనం 'శ్రీ గణేశ గీత' పూజ్యశ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వినాయక చవితి దివ్యాశీస్సులు, 06-30: **అన్నదాత,** 07-00: **ఈటీవీ న్యూస్,** 07-30: **శుభమస్తు:** శిరిడిసాయికి హారతి సమర్పిస్తే ఎలాంటి ఫలితాలొస్తాయి; ఇల్లు నిర్మించే స్థలాన్ని శుద్ధి చేయడం ఎలా? (రేపటి స్పెషల్ శుభమస్తులో బ్రహ్మశ్రీ చాగంటి విశేష ప్రవచనం 'శ్రీ వినాయకవ్రతం'; అదృష్ట భాగ్యాన్నిచ్చే శ్రీ గణేశవాస్తు వివరాలు), 08-30: **టాలీవుడ్ టైమ్,** 09-00: **ఈనాడు సినిమా: తొలిచూపులోనే...** (కల్యాణ్‌రామ్, ఆకాంక్ష).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు 'దొండకాయ పల్లీ ఇగురు' మీచేతి వంట 'మిక్స్‌డ్ వెజ్ పికిల్', 'ఆలూ తోటకూర వేపుడు', జస్ట్ ఎ మినిట్ 'క్యాప్సికం ఫ్రిట్టర్స్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2)** (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్-2** (రిపీట్), 05-30: **ఆడాళ్ళా మజాకా:** రావులపాలెంలో పరవళ్ళు తొక్కిన అతివల ఉత్సాహం, 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్,** 09-30: **జబర్దస్త్:** కడుపుబ్బ నవ్వించే కామెడీ షో...), 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందో బ్రహ్మ రిపీట్
01:15 డిజె రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే.. పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందో బ్రహ్మ
10:15 డిజె
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: **కాబోయే అల్లుడు** (రాజేంద్రప్రసాద్, కల్పన), 10-00: మార్నింగ్ షో: **హంతకులొస్తున్నారు జాగ్రత్త!** (రామకృష్ణ అంజలి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: **ఆడుతూ పాడుతూ...** (శ్రీకాంత్, సునీల్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: **జీవితమే ఒక సినిమా** (వరుణ్‌రాజ్, గీతాంజలి), రాత్రి: 7-00: ఫస్ట్ షో: **రామరాజ్యం** (జగ్గయ్య, సావిత్రి), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: **బ్రేక్ ఫాస్ట్ షో** - ఎగ్ క్రేప్స్ & తెలగపిండి రవ్వ బాత్, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో** – అవకాడొ క్రీప్స్ & తెలగపిండి మిక్స్‌డ్ వెజిటబుల్ ఊతప్పం, **ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు** – అటుకుల బర్ఫీ & కరివేపాకు అన్నం, **ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు** – పన్నీర్ మఖనీ రైస్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (వృద్ధ వయసు వారికోసం)** – ఫిష్ కర్రీ విత్‌అవుట్ ఆయిల్, **ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్"** - అక్కి రోటీ & రాజంకి చట్నీ, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** - మూరీ ఘూంటో (బెంగాలీ క్యూసైన్), **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్** – బెల్లం రవ్వ హల్వా, **మ.12.30, రా.8.45: "కా అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - కేరళ స్టైల్ చికెన్ కర్రీ, **మ.12.45: సూప్స్ & స్టార్టర్స్** - షెజ్వాన్ బ్రొకోలీ పీనట్ టిక్కీ, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్)** – జపనీస్ ఫిష్ సూప్ అండ్ ప్రాన్స్ & ఫిష్ క్యాబేజి, **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - బచ్చలికూర అవపెట్టిన కూర పులుసు, **మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్** – పన్నీర్ టమాటో మసాలా, **మ.2.30: చోటా షెఫ్** – పొటాటో క్యాబేజి బాల్స్, **మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి** – స్వీట్‌కార్న్ మష్రూమ్ సూప్, **మ.5.15: స్నాక్స్** - బ్రెడ్ దహీ వడ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: మధుమేహం... ఆధునిక చికిత్సలు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, కొమ్ముచిక్కల, పశ్చిమగోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ విజయ గణపతి ఆలయం, ఖమ్మం, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: మధుమేహం... ఆధునిక చికిత్సలు, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 24-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయె - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగళు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రీపీట్), **సాయంత్రం:** 04-30 వినాయక పూజావిధానం, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 పత్రిపూజ - ఆరోగ్యం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 జ్యోతి గణేష్ ఆలయం, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 వినాయక వైభవం.

భక్తి TV — **ఉదయం:** 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయిగీతామృతం, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 గణపతి వైభవం, 09-00 శ్రీగణేశాయ నమః, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 గణపతి కటాక్షం, 05-30 శ్రీగణేశ సహస్రం, 06-00 శ్రీగణేశస్తోత్రం, 06-30 ఖైరతాబాద్ గణేష్ దర్శనం (లైవ్) **రాత్రి:** 07-00 జయ గణనాయక.. వినాయక (లైవ్), 08-00 వినాయకాయ విద్మహే, 08-30 గణపతి క్షేత్ర వైభవం, 09-00 శ్రీగణేశాయ నమః, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 శ్రీగణేశస్తోత్రం.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: దమ్ము, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణ ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా..., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: భీమవరం బుల్లోడు.

స్టార్ మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: డాన్, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: షిరిడి సాయి, **సాయంత్రం:** 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

జెమిని — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా:బంగారం , **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: గుండె ఝల్లుమంది, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: గోలీమార్.

గొర్రెల్లో కాలిపుండు వ్యాధి



ప్రస్తుతం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఈ అంటువ్యాధి అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతోంది. కాలిపుండు వ్యాధి గొర్రెల పెంపకందార్లకు తీరని ఆర్థిక నష్టాన్ని కలుగ చేస్తుందని సదాశివనగర్ మండల పశువైద్యాధికారిణి గీతమాలిక తెలిపారు.

వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా కురిసి, నేలలు చిత్తడిగా తయారై, ఆ నేలల మీద మందలు తిరిగినప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. పచ్చిక బయళ్లలో మురుగునీటి సౌకర్యం సరిగా లేక నీరు నిలిచినప్పుడు, ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. గిట్టలు వంకర తిరిగి ఉన్నప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. వ్యాధి సోకిన గొర్రెల ద్వారా వ్యాధి ఇతర గొర్రెలకు వ్యాప్తి చెందుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉండి, గిట్టలకు దెబ్బలు తాకినప్పుడు వ్యాధి త్వరగా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు: ★ ముందుగా మందలోని కొన్ని గొర్రెలు ఒకటి లేదా రెండు కాళ్లు కుంటుతూ నడుస్తాయి.
★ గొర్రెల గిట్టల మధ్యభాగం ఎర్రగా కందుతుంది.
★ వ్యాధి సోకిన గొర్రె ముడికాళ్ల మీద గెంతుతుంది.
★ గొర్రెలు మేత సరిగా మేయవు. బరువు తగ్గుతాయి.
★ ఎర్రగా కందిన భాగం ఉబ్బి, చీము పట్టి నల్లగా కమిలిపోతుంది.
★ ఈ భాగంపై తొడుగు ఏర్పడి, అదే క్రమేణా ఊడిపోయి, చెడువాసన వస్తుంది.
★ వ్యాధి తీవ్రంగా ఉంటే గిట్టలు కూడా ఊడిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స: ★ వంకరగా తిరిగి ఉన్న గిట్టలను హూఫ్‌కట్టర్ తో గాని స్కాల్‌పేల్‌తో గాని ట్రిమ్మింగ్ చేయాలి. ట్రిమ్మింగ్ చేసే ముందు పరికరాలను యాంటీసెప్టిక్ ద్రావణంతో శుభ్రపరచాలి.
★ వ్యాధి సోకిన గిట్టలను 8 శాతం మైలుతుత్తం ద్రావణంలో గాని 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణంలో గాని 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో రోజుకు రెండుసార్లు కడిగి ఫురోసిన్ లేదా నెబాసల్ఫ్ ఆయింటుమెంట్ రాయాలి.
★ బాగా చెడిపోయిన గిట్టలను 5 శాతం ఫార్మాలిన్ ద్రావణంలో గానీ గంట సేపు ఉంచితే వ్యాధి త్వరగా నయమవుతుంది.
★ వైద్యం చేయించే గొర్రెలను మందతో పాటు పంపకుండా, సిమెంటు కాంక్రీటు నేల మీద కనీసం రెండు గంటల పాటు ఉంచి తదుపరి శుభ్రమైన పచ్చిక బయళ్లలో మేపాలి.
★ పశువైద్యుని సలహా మేరకు పెన్సిలిన్ వంటి యాంటి బయోటిక్ మందులు వాడాలి.

నివారణ చర్యలు ★ వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి, ఆరోగ్యవంతమైన గొర్రెలకు ఈ వ్యాధి సంక్రమించకుండా జాగ్రత్తపడాలి.
★ మందను చిత్తడి నేలలో, నీరు నిలిచే ప్రదేశాలలో నిలుపకుండా ఎత్తయిన పొడి ప్రదేశాలలో నిలపాలి.
★ వ్యాధి సోకిన గొర్రెలు మేసిన ప్రదేశాలలో ఆరోగ్యవంతమైన మందను మేపకూడదు.
★ వర్షాకాలంలో మందను 10 శాతం జింకుసల్ఫేట్ లేదా 4-8 శాతం కాపర్‌సల్ఫేట్ లేదా 5 శాతం ఫార్మాలిన్ ద్రావణం కలిగిన ఫుట్‌బాత్‌ల ద్వారా నడిపించాలి.
★ గొర్రెల కాపరి వ్యాధిగ్రస్తమైన గొర్రెలకు డ్రెస్సింగ్ చేసిన తదుపరి పరికరాలను, చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ఇతర గొర్రెలకు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తపడాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్ (కామారెడ్డి జిల్లా)

మొక్కజొన్నలో కాండంతొలిచే పురుగు

కాండంతొలిచే పురుగుల వల్ల మొక్కజొన్నకు 40-50 శాతం పంటనష్టం వాటిల్లుతుంది. మొక్క మొలకెత్తిన 10-40 రోజులు వరకు ఈ పురుగు ఆశిస్తుంది. దీని తల్లి రెక్కల పురుగులు పంట లేని కాలంలో కలుపు మొక్కలు మీద, పొలం గట్ల మీద గుడ్లు పెడతాయి. ఇవి 5-6 రోజుల్లో పొదిగి పిల్ల లార్వాలు బయటకు వస్తాయి. ఈ పిల్ల పురుగులు మొదట ఆకులపై పత్రపరితాన్ని గోకి తింటాయి. తరువాత ఆకు ద్వారా కాండం లోపలికి చేరుకుంటాయి. కాండం లోపల పదార్థాన్ని కూడా గోకి తినడం వల్ల ఆకులు విచ్చుకున్నప్పుడు పొడ వాటి చిల్లులు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదుగుతున్న కొద్ది లోపల అంకురం తినడం వల్ల మొవ్వు ఎండిపోతుంది. మొవ్వు చేత్తో పీకితే సులువుగా ఊడి వస్తుంది. దీనిని 'డెడ్‌హార్ట్' అంటారు. కాండం లోపల చూస్తే గుండ్రని లేదా 'ఎస్' ఆకారపు సొరంగాలు ఏర్పడుతాయి. మొక్కలు చనిపోయి పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుంది.

చేపట్టాల్సిన సస్యరక్షణ: ★ పంట కాలంలో కలుపు మొక్కలు చెత్త-చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి.
★ పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి.
★ కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున పైరు మొలకెత్తిన 25-30 రోజులకు ఆకు సుడుల్లో వేయాలి.
★ పురుగును సమర్థవంతంగా నివారించగలుగుతాం.
★ పైరు మొలకెత్తిన 10-12 రోజులకు మోనోక్రోటోఫాస్ 320 మి.లీ., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే పురుగును సమర్థవంతంగా నివారించవచ్చు.